"To-day is the proudest day of my life. To-day it has pleased Providence to give me the unique honour of announcing to the whole world that Indian army of liberation has come into being. This is the Army that will emancipate India from the British yoke. Every Indian must feel proud that this Indian army has been organised entirely under Indian leadership and that when the historic moment arrives under Indian leadership it will go into battle. Standing to-day in the graveyard of British Empire even a child is convinced that the British Empire is already a thing of the past. Comrades! My Soldiers! Let your battle cry be "To Delhi, To Delhi". Comrades it is your privilege and honour to be the first to come forward and organise India's National Army. You are to-day the custodians of Indian National honour, and the embodiment of India's hopes and aspirations. Conduct yourselves in a way that your countrymen may bless you and may be proud of you. I assure you that I shall be with you in darkness and in sunshine, in sorrow and in joy, in suffering and in victory. For the present I can offer you nothing except hunger, thirst, suffering, forced marches, and death, It does not matter who among us will live to see India free. It is enough that Indians shall be free and that we shall give our all to makeher free. May God now bless our Army and grant us victory.

In the coming fight we shall ultimately win and our task will not end till our surviving heroes hold the victory parade on another grave-yard of the British Empire, the Lal Qilla of Ancient Delhi." Netaji gave this stirring message to the Army of Liberation I.N.A.

"The Azad Hind Fauj has a vital role to play. To fulfil this role we must weld ourselves into the army that will have one goal, the freedom of India and only one will 'to do or die' in the cause of freedom." Netaji Subhas Bose.



OXFORD Group of Indians



The Left in Congress, Subhas, J. P. Yousuf Meharali



National Leaders Congregation at Palakol



World Telugu Conference at Hyderabad



Andhra Leader at World Telugu Conference



50 Years of Parliamentary Career, New Delhi
Indiraji Presenting Momento



50 Years of Parliamentary Career, New Delhi
Balrama Jakkar, R.C. Chairman



50 Years of Parliamentary Carrier, New Delhi
with H. V. Kamath



50 Years of Parliamentary Carder, New Delhi
P. Thimmareddy Addressing



50 Years of Parliamentary Carrier, New Delhi
R.C. Gen. Sec. M. Satyanarayana

తెలుఁగులెంక

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

# కానుక

వగ్గువారిని గాదు జవ్వనము పిలుపు
లందుకొనువారి నార్తసేవానురక్త
చిత్తులగువారి సవరింతసేయుకొఱకు
బ్రదుకవలయు రంగా శతాబ్దముల వఱకు.

ఈవి నేర్వక భోగముల్ రావటంచు
వచ్చినన్ నిల్వఁజాలవు నిచ్చ లనుచు
పిలిచినన్ గీర్తి నీ వంచుఁ దెలుపుకొఱకు
బ్రదుకవలయు రంగా శతాబ్దముల వఱకు.

చేయఁదగినట్టిపని జనశ్రేయమునకుఁ
గారణం బగుపని ఫలకాంక్ష వదలి
సలిపి ముక్తుండ వగు మని పలుకుకొఱకు
బ్రదుకవలయు రంగా శతాబ్దముల వఱకు.

చేఁతలను మానివైచుటచేత రాదు
అగ్ను లార్పుటచేత రా దమృతభావ;
మనఘ మగుయోగమున వచ్చు ననుటకొఱకు
బ్రదుకవలయు రంగా శతాబ్దముల వఱకు.

విశ్వహిత మైన జీవనవిధి వరించి
యెల్లజీవుల యందుఁ ద న్నీక్షచేఁత
ప్రాణికిన్ గృత్య మనుపాడి పగటు కొఱకు
బ్రదుకవలయు రంగా శతాబ్దముల వఱకు.

పగటు - ప్రకటించు

# వెలుగు కిరణం

రచన : దీవి రంగాచార్యులు M.A.,B.Ed., స్వర్ణ

రంగాజీ ఎనుబది ఆరవ జన్మదినోత్సవం!
రమ్యమౌ రైతుకూలీల నేత్రోత్సవం!!

పండుపండిన విజ్ఞాన పరిచయమ్ము
అండగానిలిచిన భారతిహృదయమ్ము
అంతులేని అంతేవాసుల సందోహమ్ము
అమరినది ''ఆచార్య రంగా'' జీవితమ్ము!

అదొక ఉత్తమ రాజకీయగురుకులం
అరితేరిన వక్తల మాతృనిలయం
స్వార్థమెరుగని జీవిత పోరాటం
నిస్వార్థ ''రంగా'' ఆశయ ఆరాటం!

ఏబదిరెండు వసంతాల ప్రజాప్రాతినిధ్యం
ఏర్చికూర్చిన రైతుకూలి ఉద్యమనేతృత్వం
తిరుగులేని వాక్చాతుర్య ప్రతిభాదర్పణం
తెలుగుజాతికే ''రంగాజీ'' వెలుగుకిరణం!

పదవికోసం ప్రాకులాడనివాడు
రాజకీయ సిద్ధాంత రథచోదకుండు
గ్రామీణ ఆర్థికశాస్త్ర నిపుణుండు
కీర్తినందె ''ఆచార్య రంగా'' ఘనుండు!

ఈవిశాల హృదయుని సేవాపథమ్ము
భావితరాలకు సదా అనుసరణీయమమ్ము
అట్టి ఆదర్శవ్యక్తికి శుభ సమయమ్ము
అందిద్దాం! అనురాగ సుమాలనంతమ్ము!

అమరాలి అక్షరాక్షతలు లక్షవరాలై సతతమ్ము!
అందుకోవాలి! స్వర్ణవల్లభ స్వామి కృపారసమ్ము!!

సమర్పణ :
మీ శ్రేయోభిలాషులు
Dr. దీవి హనుమాచార్యులు, స్వర్ణ.

# "సజ్జన హృదబ్జభృంగ–ఆచార్య రంగ!"

ఉ॥ శ్రీయుత; గోగినేని కులశేఖర; భారతవీర ధీక! దీ
ర్ఘాయువు మీకొసంగిన మహాప్రభువున్ మదినిం దలంతు మా
నాయకముఖ్య! శాంతిసదనంబన నొప్పు మనస్సు మీది, మీ
ధ్యేయము దీనమానవ సుధీజన గేయము నీతి న్యాయముల్!

తే॥ గీ॥ స్వార్థమించుకలేని మహామనీషి
వనుచు కవిపండితులు కొనియాడు చుంద్రు,
అట్టి నిను సంస్మరింప కేనెట్టులుందు?
సజ్జన హృదబ్జ భృంగ–ఆచార్య రంగ!

మ॥ గురువర్యా! భవదీయ జన్మదినమున్–కోట్లాది యాంధ్రప్రజల్
జరుపన్ గాంచితి, మీపయింగలుగు సాజంబైన భక్తిన్ నవం
బరు మాసంబున భారతీయు లనుపంబైనట్టి యానంద సా
గరమందున్ వడిఁ దేలుచుండిరదె; రంగాజీ! మహానాయకా!

సీ॥ హరిజనుల్ క్రైస్తవు లన్నదమ్ములు, రక్త
సంబంధమును గల్గు జనులు వారు
అంటరానితనమ్మునందు పేదరికమ్ము
నందు సమానులైనట్టి వారు
ప్రతిగ్రామమున వెలుపల వసించుచు నెట్టి
సుఖములేనట్టి శ్రామికులువారు
ఆనాడు నీనాడు నేనాడు విడదీయ
సాధ్యముగాని వంశజులు వారు

తే॥ గీ॥ హైందవ మతమ్మునందున్న హరిజనులను
క్రీస్తు నెద నమ్ముకొన్నట్టి క్రైస్తవులను
సమముగా జూచునట్లు లోకస్సభను బలికి
విజయమును గూర్చ నర్థింతు విబుధవంద్య!

ప్రొఫెసర్ డా॥ పి. తిరుమలరావు

# శుభాకాంక్షలు

రైతు బాంధవ!

రైతన్న పదముకూ పర్యాయపదమైతివి
నా చిన్నిగీతికకు, నిస్వార్థసేవకు నిందురైతైతివి,
పొలముదున్నెడి రైతుహలమె, బలము మనకని,
ఆంధ్రదేశము, అఖిలభారత అన్నపూర్ణగ,
ఆదుకొనెడి, ఆదరింపు అదృష్ట ముందని
దూరదృష్టితో, దిక్కులన్నీ పిక్కటిల్లగ
ఏబదేడుల మునుపె నీవు ఎలుగెత్తుపాడిన,
మేలుకొలుపులు పాడినట్టి, రైతబాంధవ

స్వాగతమ్ము, శుభముశుమ్ము
ఏలనా, నేడె నీజన్మోత్సవమ్ము!
రైతుబాంధవ స్వాగతంబు
యన్. జి. రంగా స్వాగతంబు.

రైతుకూలీ రాజ్యమే మన ధ్యేయమంచూ
బుద్ధిజీవుల నుద్ధరింపుచు, అన్ని వర్గములొక్కపై

మరి వర్గభేధము, లేని స్వర్గపు, మార్గమందున,
జాతి నడవగ "లాస్కి" ప్రభృతులర్థశాస్త్రపు
నీతిగతుల, భరతజాతికి చాటి చూపిన

ప్రొఫెసరయ్యా స్వాగతంబు
రైతబాంధవ స్వాగతంబు
నీదుశుభమే మాదు సొమ్ము
ఏలనా, నేడెబో నీ జన్మోత్సవమ్ము!

జాతినేతల స్థాన మందున
నీకు కలదొక విశిష్ట స్థానము
పార్లమెంటున వున్నవారిలో
వృద్ధులందు వృద్ధిపొందుచు,
బుద్ధిచెడని వృద్ధనేతవు,
స్వతంత్ర్య యుద్ధపు సమరనేతవు,
జాతినేతల స్థానమందున
నీకు, ఇదొక విశిష్ట స్థానము!

రైతుబాంధవ జయము జయము
ప్రొఫెసరయ్యా! శుభము శుభము,
ఇదియెనా, ఎనుబదారవ జన్మోత్సవంబు,
జయముతోడ. చేరుమయ్య, నూటఇర్వది వత్సరంబు!

శ్రీ కల్లూరి చంద్రమౌళి

# ప్రశంస

శ్రీ ఎ. యల్. సుబ్బారావుగారు

ఆర్యా! నమస్కారములు, శ్రీ రంగాగారి ప్రశంసల సంఘము, హైదరాబాద్.

తమ ఆహ్వానమునకు కృతజ్ఞుడను. ఆచార్య శ్రీ రంగాగారు వయోవృద్ధు లయ్యును, శక్తిపాటవము తగ్గక ఆరోగ్యవంతులుగ – కార్యదక్షులుగ యిప్పటికిని - సేవాకార్యముల చేపట్టి బాగుగ నిర్వహించుచుండుట ముదావహము. ప్రశంసనీయము. దేశభక్తుడుగ – నీతినియమములను పాటించి, పాటించుచున్న, శక్తి పటుత్వపరులుగ, కార్యదక్షతగల ఉత్సాహవంతుడు ఆచార్య రంగాగారు. డిప్యూటీ లీడర్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పదవిని ఎంతో దక్షతతో – విజయ వంతముగ – ఉత్సాహముగ నిర్వహించుచున్న మహా–దేశభక్తులు. నిస్స్వార్థ పరాయణులు. సేవాతత్పరులుగ ఇప్పటికిని సమంజసముగ నిర్వహించుచున్న మాననీయులు. వారి 86వ జన్మదిన శుభసమయమున– నాశుభములను–హృదయ పూర్వకముగ–ప్రేమతో అందించుచున్నాను.

భగవంతుడు ఆయనకు సదా అండదండగ నుండి - వారిని సంరక్షించు చుండును గాక!

ఓమ్ శాంతిః శాంతిః శాంతిః

శ్రీ దుర్గా కృష్ణమూర్తి

# రంగాజీ

"నా అనుమతి కావాలని కదూ నీవు వచ్చింది. (బాపూజీ శాస్త్రివాలతో, 1934లో) నీ అంతరాత్మ నిన్ను దేనిని ప్రబోధిస్తుందో అదే చేయి: ప్రతివ్యక్తి తాను నమ్మిన సిద్ధాంతం కొరకు కృషి చేయాలి. తాను నమ్మిన సిద్ధాంతాన్ని తాను నమ్ముతున్నట్లుగా నటించటం ఆత్మద్రోహం చేసుకొనటమే. నా శుభా కాంక్షలు, ఆశీర్వాదాలు సదా నీకు ఉంటాయి" మహాత్మాగాంధి(నా,"స్మృతులు" పేజీ 42 దు॥కృ॥)

బాపూజీయొక్క ఈ ప్రవచనాన్ని అక్షరాల పాటించిన మహావ్యక్తి రంగాజీ. అయిదున్నర దశాబ్దాలకుపైగా కిసాన్ ఉద్యమ నిర్మాణ కర్తగా, రాజ కీయ నాయకుడుగా తన జీవితాన్ని ధారపోసిన మహా త్యాగి రంగాజీ.

ఎదుటివారి అభిప్రాయాలెలాఉన్నా, వాటితో తాను ఏకీభవించినా, ఏకీ భవించకపోయినా, వారిని, వారి భావాలను గౌరవించటంలో వీరికి వీరే సాటి. ఉదాహరణ: రైతాంగ విద్యాలయానికి (1935లో) నే వెళ్లా. గౌతు లచ్చన్నగారు (ఆరోజుల్లో రంగాగారి ముఖ్య అనుచరులలో ఒకరు, రాజమండ్రిజైలులో(1932)

నాకు సహచరులు.) "వీరు కమ్యూనిస్టు, వీరికి మన విద్యాలయంలో పాల్గొనే అవకాశము ఈయరాదు" అన్నారు. రంగాగారు ఈ అభ్యంతరాన్ని త్రోసి పుచ్చుతూ, ప్రతివారికి వారి వారి భావాలను వెలిబుచ్చే అవకాశాన్ని కలుగజేయాలంటూ, తమ విశాల హృదయాన్ని వ్యక్తపరచి రంగాగారు నన్ను మాట్లాడమన్నారు.

ఇంతేకాదు ఉద్యమవ్యాప్తికి, కార్యసాధనకు, అభిప్రాయభేదాలకు తావు ఇవ్వకుండా, సహకరించి పనిచేయటంలో పార్టీల అడ్డుగోడలను ఛేదించిన మహా ప్రజానాయకుడు, రంగాజీ.

1936లో కిసాన్ ఉద్యమ వ్యాప్తికి, కమ్యూనిస్టులతోను, కాం॥ సోషలిస్టులతోను, మరి ఇతర అభివృద్ధి కాముకులతోను చేతులు చేతులు కలిపి పని చేసిన, చేయించిన కిసాన్ నేత రంగాజీ.

పార్టీలు మార్చేవారని, ఎంత మంది ఎన్ని అభాండాలు వేసినా, పైన వ్రాసిన బాపూజీ సలహాయొక్క అడుగు జాడల్లో, జంకు గొంకు లేకుండా పయనించిన మహా బాటసారి రంగాజీ.

1940-42 సంవత్సరాలలో, మేము వెలూరులో డిటెన్షన్ కాంపులో ఉన్న రోజుల్లో, కమ్యూనిస్టులు నడుపుతున్న డాక్టరు కె. బి. కృష్ణగారి క్లాసులకు వర్గాలు అనే భేదభావం లేకుండా అప్పుడప్పుడు హాజరు అవుతూఉండేవారు. తాను స్వయంగా ఆచార్యులనే అహంభావం లేకుండానే విజ్ఞానవికాసానికి పార్టీ భేదాలు అడ్డుగోడలు కాకూడదని ఋజువుచేసిన మహామేధావి ఆచార్య రంగాజీ.

ఇటువంటి మహావ్యక్తిని గురించి వ్రాసుకొంటూపోతే పేజీలకు పేజీలు వ్రాయవచ్చు. ఒక గ్రంథమే వ్రాయవచ్చు.

వయస్సులో చిన్నవాడిని కనుక (74 సం॥) ఈ మహా పురుషుని దీవించ టానికి బదులు, 86వ పడిలో పడిన యీ రాజకీయ పితామహుని మా బోటివారిని ఆశీర్వదించాలని నా ప్రార్థన. నాకు నమ్మకం ఉంది, వీరు 1989వ పార్ల మెంటరీ ఎన్నికల్లో గెలిచి తిరిగి కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ డెప్యుటీ లీడర్గా. పదవిని అలంకరిస్తారని.



శ్రీ పి. రాజగోపాలనాయుడు
(మాజీ పార్లమెంటు సభ్యులు)

# దోపిడీదార్ల పక్కలో బల్లెం రంగాజీ

"రైతులకు విముక్తి కలగాలంటే బ్రిటిష్ ప్రభుత్వం పోవాలి" అన్న నినాదమిచ్చారు రంగాగారు స్వాతంత్ర్య వుద్యమ కాలంలో. ఆరోజుల్లో తమ ఇనుపపాదాల క్రింద రైతుల్ని నలిపివేస్తున్న జమీందార్లు, ఈనాందార్లు, మొఖాసా దార్లువారికి ఊతమిస్తున్న సంస్థానాధీశులు చాల బలంగావున్నారు. బ్రిటిష్ తుపాకులు వారికి రక్షణ కల్పిస్తున్నవి. బ్రిటిష్ ప్రభుత్వం పోతేగాని సంస్థానాధీశులు, జమీందార్లు, ఈనాందార్లు, మొఖాసాదార్లు బలహీనపడరు. కనుక రైతు లందరు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కూలదోయాలి అన్నారు వారు.

అంతేకాదు. రైతులు ఏకకాలంలో రెండు పోరాటాలను నడపవలసి ఉన్నది. బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడుతూనే దోపిడీదారులైన జమీందార్లతో, సంస్థానాధీశులతో కూడ పోరాడాలి. భారతదేశంలో రైతాంగం ఒక బలీయమైన పోరాటశక్తిగా రూపొందాలి అనికూడ రంగాగారు పిలుపునిచ్చారు.

ఇతర దేశాల చరిత్రను చూచినప్పుడు వారి మాటల్లోని యదార్థం గోచరమవుతుంది. అమెరికాలో ఆనాడున్న బ్రిటిష్ ప్రభుత్వ యాజమాన్యాన్ని అంతమొందించడానికి రైతులెంతో పోరాడారు. కాని అమెరికా స్వాతంత్ర్యం పొందిన

తరువాత జరిగిందేమిటి? ఆ ప్రభుత్వం పెట్టుబడిదారుల కైవశమయింది. జర్మనీలో ఆనాడున్న ప్రభుత్వాన్ని పడగొట్టడానికి రైతు లెన్నో త్యాగాలు గావించారు. ఫలితంగా ఆ ప్రభుత్వం పడిపోయింది. కాని దానికిబదులు ఏర్పడిన ప్రభుత్వ మెవరిది? నియంతయైన హిట్లరుది. ఆ ప్రభుత్వంలో రైతులకేమాత్రం భాగం లేకపోయింది. రష్యాలో జారు ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కార్మిక నాయకత్వ ప్రధానమైన కమ్యూనిస్టు పార్టీ ఎంతో ప్రయత్నంచేసి, ఎన్నో పోరాటాలు జరిపి విఫలమయింది. తరువాత రైతుల తోడ్పాటును తీసుకొని జారులపై తిరుగుబాటు గావించింది. ఆ తిరుగుబాటులో లక్షలాదిమంది ప్రాణాలు పోగొట్టుకొన్నారు. తుదకు జారు ప్రభుత్వం పడిపోయింది. కొత్త ప్రభుత్వం ఏర్పడింది. కాని ఏమి ప్రయోజనం. అది రైతాంగ వ్యతిరేకమైన కమ్యూనిస్టు ప్రభుత్వం. ఆ ప్రభుత్వమేర్పడిన తరువాత రైతులు తమ భూముల్ని పోగొట్టుకొని వ్యవసాయ కూలీలుగా మార్చబడినారు. అర్ధ బానిసలు చేయబడ్డారు.

ఏ విప్లవాన్ని తీసుకున్నా అందులో హెచ్చు త్యాగాలు గావించింది రైతులేనన్న విషయం స్పష్టమవుతుంది. కాని ఆ విప్లవ ఫలితం వారికిగాక తదితరులకు దక్కిన సత్యం తేటతెల్లమవుతుంది. ఈ విప్లవాలలో, ఈ పోరాటాలలో, ఈ తిరుగుబాట్లలో పాల్గొన్నవారిలో అధికసంఖ్యాకులు రైతులైనా ఎందువల్ల వారికా విప్లవఫలితాలందలేదు? ఆ పోరాటాలలో రైతులు నాయకత్వం వహించలేదు. ఇతరుల నాయకత్వం కింద పోరాడారు. అందువల్ల ప్రభుత్వాలను పడగొట్టడానికి వారు పనికివచ్చారుగాని ప్రభుత్వాలు కట్టడానికి కాదు. అందుకనే స్వాతంత్ర్యోద్యమం రైతాంగ నాయకత్వాన నిర్వహించబడాలని అన్నారు. కాని అది సాధ్యంకాలేదు. దేశంలో అలాటి పరిస్థితులు లేకపోవడమే అందుకు కారణం. రంగాగారిలాటి మేధావి ఏలాటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొని పోరాటలను నిర్వహించగల ధైర్యశాలి నాయకత్వం లభించినప్పటికీ దేశంలో ఆకోవకు

చెందిన నాయకులు లభించకపోవడంవల్ల ఈదేశంలోకూడ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రైతాంగ నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడకపోయింది. అందువల్లనే వారు జమీందారులను రద్దుగావించగలిగినప్పటికీ దోపిడీదారుల నుండి తప్పుకొనలేకున్నారు.

కార్మికులు విప్లవకారులు. వారు దోపిడీదారుల నెదిరిస్తారని మార్క్స్ ప్రవచించారు. కాని చరిత్ర అలా చెప్పడంలేదన్నారు రంగాగారు. సామ్రాజ్యవాద దేశమైన ఇంగ్లండులో నున్న కార్మికులు, ఆ దేశ ప్రభుత్వం భారతదేశాన్ని దోపిడీచేస్తుంటే దానిని సమర్థించి దానిలో పాలుపంచుకొన్నారు. అలాగే అమెరికాలో నున్న కార్మికులు ఆ పెట్టుబడిదారులతో కలిసి వలస దేశాలను, బడుగుదేశాలను దోపిడీ చేస్తూనే వున్నాయి. ఆవిధంగానే మన దేశంలోని కార్మికులు కూడా వ్యవసాయ ధరల నిర్ణయం వచ్చినప్పుడు పెట్టుబడిదారులకు వంత పాడుతున్నారు.

వ్యవసాయ వస్తువులు కార్మికులకు చౌకగా కావాలి. పెట్టుబడిదారులకు గూడ అవి సరసమైన ధరలకు రావాలి. అప్పుడే వారు హెచ్చు లాభాలు గడించ గలుగుతారు. కనుక ఈ విషయంలో ఇద్దరూ ఏకమవుతుంటారు. అలా కాకుండా చేసి రైతులు ధరల విషయమై పెట్టుబడిదారులతో పోరాడాలంటే కార్మికులకు ప్రభుత్వం చౌకధరలకు వస్తువులనందించాలి. అప్పుడు వారు ఈ సమస్యకు సంబంధించి పెట్టుబడిదారులతో కలవడానికి వీలులేదు. ఇది రంగాగారి విశ్వాసం. అందుకనే కార్మికులు హెచ్చుగా వున్నచోట, చౌక డిపోలు పెట్టించమని రంగాగారు చెబుతూ వచ్చారు. ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొనివచ్చారు.

వ్యవసాయ కూలీలకు గూడ సరసమైన ధరలకు వ్యవసాయ వస్తువులు కావాలి. వాటిని కొనడానికి వారివద్ద చాలినంత ద్రవ్యముండదు. పైగా సంవత్సర

మ:తా కూలి దొరకదు. కనుక వారెన్నడూ దారిద్ర్యంలో కృంగిపోతుంటారు. తమ దారిద్ర్యానికంతటికీ రైతులే కారణమని వారిపై అసూయ పెట్టుకొంటారు. ఈ పరిస్థితి గ్రామాలలో వర్గాలను సృష్టించి రైతులను చాల బలహీనపరుస్తుంది. దీనిని నివారించాలని రంగాగారి పట్టుదల. అందువల్ల వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు నిర్ణయించి వాటిని చక్కగా అమలుజరిపితే అప్పుడు వారు కొంతవరకు సంతృప్తి చెందుతారు. వారికి రైతుల మీద నున్న క్రోధం తగ్గుతుంది అనుకొని రంగాగారు వారికి కనీస వేతనాలు నిర్ణయింపజేయడానికెంతో ప్రయత్నించారు.

అలా నిర్ణయింప జేసినా సంవత్సరంలో కొన్ని నెలలు వ్యవసాయ కూలీలకు పనులు లేకపోవడంవల్ల వారి పనితనం పూర్తిగా పోలేదు. అందుకని ఆ దినాలలో ప్రభుత్వమే వారికి పనులు కల్పించాలని రంగాగారన్నారు. పనికి ఆహార పథకం, (జాతీయ గ్రామీణ ఉపాధి పథకం) ఉపాధి కల్పనా పథకం ఇవి వచ్చిన తరువాత రంగాగారి ధ్యేయం చాలవరకు నెరవేరిందనే చెప్పాలి. ఈ పథకాలకు హెచ్చు పెట్టుబడులు పెడితే, క్షామ నివారణ కార్యక్రమాలకు హెచ్చు మొత్తాలు వెచ్చిస్తే ఈ సమస్య చాలవరకు పరిష్కారం కాగలుగుతుంది. రైతుల, వ్యవసాయ కూలీల మధ్య ఐక్యత ఏర్పడడానికి వీలుంటుంది.

ఇంత చేసినా గ్రామాలలో అస్పృశ్యత వున్నంతవరకు, హరిజనులను చిన్న చూపు చూచినంతవరకు తన ఆశయం సఫలం కాకపోవచ్చునని రంగాగారి అభిప్రాయం. వ్యవసాయ కూలీలలో హరిజనులే అత్యధిక భాగం గనుక ఆర్థికంగా వారు బాగుపరచినప్పటికీ సాంఘిక వ్యత్యాసాలున్నంతవరకు గ్రామాలలో ఐక్యత సాధ్యంకాదని, హరిజనులు హింసాత్మకవాదుల చేతులలో పడిపోవచ్చునని రంగాగారనుకొన్నారు. అందుకనే అస్పృశ్యతను నిర్మూలించడానికి, హరిజనులకు సవర్ణులకు భేదమేమీ లేకుండా చేయడానికి వారు చిన్నతనం నుండి

ప్రయత్నిస్తూనే వున్నారు. గాంధీగారు హరిజనోద్యమాన్ని చేపట్టకముందే వారు వారి అభ్యున్నతికోసం పాటుపడజొచ్చారు.

బ్రిటిష్ ప్రభుత్వకాలంలో ఆస్తి వున్నవారికి మాత్రమే ఓటు హక్కుం డేది. తరువాత చదువులున్నవారికిగూడ ఓటు హక్కు వచ్చింది స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఆస్తి వున్నా లేకపోయినా, చదువులున్నా లేకపోయినా ప్రతి వయోజనునికి ఓటు హక్కు వుండాలని రంగాగారు పట్టుబట్టారు. ఈ విషయంలో అనిబిసెంట్, మోతీలాల్ నెహూ్రి మొదలైనవారు వ్యతిరేకంగా వున్నా రంగా గారు ఈ విషయంలో గాంధీగారిని అంగీకరింపజేశారు. వయోజన ఓటింగు వస్తే రాజకీయంగా హరిజనుల ప్రాధాన్యత హెచ్చుతుందని, అస్పృశ్యతా నివారణ సులభతరమవుతుందని వారు మహాత్మునికి నచ్చజెప్పగలిగారు. తత్ఫలితంగా మన రాజ్యాంగంలో సార్వజనిక వయోజన ఓటింగు హక్కు ఇవ్వబడింది.

రైతుల బాగోగులు, వారి ఆర్థిక స్థితి వారు పండించే పంటలకు వస్తున్న ధరలమీద ఆధారపడివుంటుంది. అందువల్ల వాటికి కనీస ధరలేర్పాటు చేసి ఆ ధరలను ప్రభుత్వం స్థిరీకరించాలని; ఆ ధరలకు తక్కువయితే ప్రభుత్వమే వాటిని కొనాలని రంగాగారు ప్రతిపాదించారు. ఆ విధంగానే కొన్ని పంటల కనీస ధరలు నిర్ణయించబడినవి. కాని ఆ ధరలు కొనుగోలుదారుల కనుకూలంగా వుండినవి. అది రంగాగారికి ఏమాత్రం తృప్తిని కలిగించలేకపోయినది. ఈ పంటల ధరలను శాస్త్రీయ దృక్పథంతో రైతులకయ్యే ఖర్చులను దృష్టిలో ఉంచు కొని వాటిని నిర్ణయించాలని రంగాగారు పట్టుబట్టారు ఈ ధరలను నిర్ణయించ డానికి ఒక వ్యవసాయ వస్తువుల ధరల నిర్ణాయక సంఘాన్ని స్థాపించాలన్నారు. వారి పట్టుదల కారణంగా 1969 లో ఆ సంస్థ ఏర్పాటయింది. కాని దానిలో, దాని కార్యసరళిలో ఇంకా మార్పు రావాలని, రైతులకు నష్టంకాని రీతిలో ధరల నిర్ణయం కావాలని రంగాగారు పోరాడుతూనే వున్నారు.

బ్రిటీష్ ప్రభుత్వ కాలంలో, స్వాతంత్ర్యం వచ్చిన మొదటి సంవత్సరాలలో ధాన్యసేకరణ ఎంత కఠినంగా, రైతులకెంత వ్యతిరేకంగా వుండేదో అప్పటివారికి తెలియనిదికాదు. రంగాగారు కాంగ్రెస్సులో వున్నప్పటికీ, అఖిల భారత కాంగ్రెస్ కార్యవర్గ సభ్యుడుగా, ఆంధ్ర కాంగ్రెస్ అధినేతగా వ్యవహరిస్తున్నప్పటికీ వారు భారతదేశం మొత్తంమీద ఈ ధాన్యసేకరణ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమం నడిపారు. అప్పుడు వారిని, వారి పతీమణియైన భారతీదేవిని అరెస్టు చేయడానికిగూడ ప్రయత్నం జరిగింది. గాంధీగారు కల్పించుకోవడంవల్ల ఆ అరెస్టు నిలుపుదల చేయబడింది.

ఈవిధంగా వారు రైతులకోసమేగాక, వ్యవసాయ కూలీల కోసమే గాక గ్రామీణులలో ప్రధానభాగమైన చేనేతవారికోసం, జాలరులకోసం, గంజ మాల గిరిజనుల కోసం ఎంతో పోరాడారు. వారి అభ్యున్నతికోసం ఎన్నో పథకాలను ప్రభుత్వం చేపట్టేటట్లు చేయగలిగారు.

వారు సంస్థానాధీశులకు, జమీందారీవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన దినాలను పెద్దలైనవారుగ మనముంచుకొని వుంటారు. వారు పంజాబులో పర్యటిస్తున్నప్పుడు ఆనాడు బాలుడై వున్న ఈనాటి లోకసభ స్పీకర్ జాకర్‌గారు జండా పట్టుకొని వారి సమావేశంలో పాల్గొనడానికి పరుగెత్తివెళ్ళానని ఇప్పుడుకూడ చెబుతూవుంటారు. తాము నిర్మించిన రైతాంగ ఉద్యమంద్వారా భారతదేశంలో ఎంతమందినో రైతునాయకులుగా, వ్యవసాయకూలీ నాయకులుగా చేనేత నాయకులుగా చేయగలిగారు. ఏ రాష్ట్రానికి వెళ్ళినా వారిని తెలియనివారు లేరు. ఆచార్య రంగాగారన్న పదమే గ్రామీణ ప్రజల హృదయాలలో వేవెలుగులను వెలిగిస్తూవుంటుంది. వారి విద్యాలయాలలో తయారైనవారినాకు అన్ని పార్టీలకు నాయకులుగా వున్నారు. వారు మట్టిలో మాణిక్యాలను తయారుగావించారు. వారికి మేరు

గులు పెట్టారు. ఆ మహామహుడు భారత రైతాంగ ఉద్యమ పిత. వారినందరూ ప్రేమిస్తారు. గౌరవిస్తారు. వారే ఆశయాం కోసం కృషిచేశారో ఆ యాశయాలలో చాలవరకు నెరవేరినవి. నెరవేరుతున్నవి. తన జీవితంలోనే తన ఆశయాలు ఫలించడం గొప్పవిశేషం.

85 ఏండ్లయినా వారింకా ఆరోగ్యంగానే ఉన్నారు. తన జీవితంలో వారెన్నో పోరాటాలను నడిపివున్నారు. ఇప్పటికిగూడ ఏపోరాటానికైనా సిద్ధంగా వున్నారు. వారున్న ఈ యుగంలో వుండడం, వారి అనుచరులుగా వుండడం ఎంతో భాగ్యంగా భావిస్తున్నాను.



శ్రీ యస్. వీరాచారి

# ఆదర్శశిల్పి ఆచార్య రంగా

ఆచార్య రంగాగారి 86 వ జన్మదినోత్సవము 1985 నవంబరు 7 వతేదీన హైదరాబాదు గాంధీ భవనంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు ఆధ్వర్యమున జరుపుటకు నిర్ణయించుట చాలా సముచితము. ఆ సందర్భములో వారి ప్రశంసాపాత్ర మయిన జీవిత విశేషాలతో ఒక సావనీరు ప్రకటించటము ఎంతయో ముదావహము.

నేను 9 సంవత్సరముల వయసులో నున్నపుడు అనగా 54 సంవత్సర ముల క్రితము మా గ్రామమునకు శ్రీ రంగాగారు వచ్చిన సందర్భములో నేను నాతోటి పిల్లలతో కలసి కాంగ్రెసు జండాలు ధరించి వారికి జేజేలు పలికిన నాటి స్మృతులు ఈ నాటికీ నా స్మృతి పథంలో నిలిచియేయున్నవి. నేను నా హైస్కూలు చదువు సాగిస్తున్న సమయములో కడప జిల్లా చెన్నూరులో వారు నిర్వహించిన రైతాంగ విద్యాలయములో నేను విద్యార్థినై వారు మరికొంతమంది వారి శిష్యులు జాతీయ, అంతర్జాతీయ, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, నైతిక, వైజ్ఞానిక రంగాలలో యిచ్చిన ఉపన్యాసాలకు ఆ విద్యాలయములో అలవరచు కున్న క్రమశిక్షణకు నే నెంతగానో ప్రభావితుడనయి వారి అడుగు జాడలలో రాజకీయ జీవితము ప్రారంభించినాను ఆ నాటి నుండి ఈ నాటివరకు వారి ఆశయసిద్ధికై ప్రజాజీవితములోని అన్ని రంగాలలో వారికి శిష్యుడుగా పుత్ర సమానుడుగా ఈ నాటివరకు నా రాజకీయ జీవితము సాగిస్తూయున్నాను.

నిర్జీవమయిన కటిక శిలలనుండి రమణీయమయిన శిల్ప కళా ఖండాలను చెక్కి కమ్మటి కథలను ఆ శిల్పముద్వారా ప్రబోధముచేసి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మహాశిల్పులు ఎంత గొప్పవారో! ఎంతటి ఆరాధ్యులో! అంతటి మహాశిల్పి శ్రీ ఆచార్య రంగాగారు. వారు పారిశ్రామిక ప్రగతికి పేరెన్నికగన్న ఇంగ్లాండులో ఉన్నత విద్య నభ్యసించి, గుంటూరుజిల్లా నిడుబ్రోలు గ్రామములో ఒక రైతు కుటుంబములో జన్మించిన రంగాగారు ఆనాటి గ్రామీణ సోషలిష్టు వ్యవస్థ సుశాశ్వతముగా నిలిచిననాడే దేశ సౌభాగ్యము మూడు పూలు ఆరుకాయలుగా ప్రభవిల్లగలదని, గ్రామీణ చేతి వృత్తులయిన చేనేత, కమ్మరి, కుమ్మరి మొదలుగా గల వృత్తులు సజీవంగా నిలవాలనీ సిద్ధాంతీకరించి, అక్కడి వారి నంగీకరింపజేసి ఆచార్య బిరుదము పొందినారు. వీరి రాజకీయ రంగం ప్రవేశము చేసిన వెంటనే "వాహిని" అను పత్రికను స్థాపించుటతోపాటు రాష్ట్రములోని అనేక ప్రాంతాలలో రైతాంగ రాజకీయ పాఠశాలలను నిర్వహించి ఎంతోమంది యువకులను, పెద్దలను, స్త్రీ, పురుషులను సమీకరించి అన్ని శాస్త్రాలపయిన విద్యా ప్రబోధముచేసి రాజకీయ, సాంఘిక సేవకులను సృష్టించి వారికి తగిన శిక్షణ, చైతన్యము గరిపి అర్హతకల నాయకులుగా తీర్చిదిద్దిన మహాశిల్పి రంగాజీ. వీరి శిష్యరికములో తయారయిన అనేకమంది రాజకీయ నాయకులు ఈనాడు అన్ని రాజకీయ పార్టీలలో ఉన్నారనుట నిస్సంశయము.

పూజ్య పిత మహాత్మాగాంధీగారు ప్రవచించిన సత్యం, శాంతి, అహింసల పట్ల వీరు ప్రగాఢమయిన విశ్వాసము కలవారు. 1942 *Quit India* ఉద్యమములో మేము రంగాగారి అనుయాయులయిన శ్రీ కంచల ఓబుల్ రెడ్డి, శ్రీ చేగిరెడ్డి బాలరెడ్డిగార్ల నాయకత్వమున చురుకుగా పనిచేస్తున్న తరుణంలో శ్రీ రంగాగారు నన్ను పిలిచి "మీరు విద్యార్థులు బాంబులు, డైనమేట్లు ఉపయోగించాలని అనుకుంటున్నారని తెలిసింది. మీరు అలాచేయవద్దు. ఒకవేళ ఎవరయినా చేస్తే

వాటివల్ల ఎలాంటి ప్రాణహాని జరగకుండా చూడాలని చెప్పినారు. ఇది వారి అహింసా వాదానికి ప్రబల నిదర్శనము.

తాను పార్లమెంటు మెంబరుగా పార్లమెంటరీ డెలిగేషన్ నాయకుడుగా ఇతర దేశాలకు వెళ్ళినపుడు గ్రామీణ ఆర్థిక శాస్త్రముపయిన ఉపన్యాసములు యివ్వమని అందుకు పెద్ద మొత్తాలలో పారితోషికము చెల్లిస్తామని ఆయాదేశాల వారు అడిగినట్లు నాకు ఆ నాడు ఉత్తరము వ్రాస్తే వారి మనసు నెరిగిన నేను వారికేమీ వ్రాయకపోగా నాతోపాటు గుంటూరులో ఉన్న మరో విద్యార్థి "అచట ఉపన్యాసాలు చేసి వారిచ్చే పారితోషికంతో పార్టీని బలంగా నడుపుకోవవచ్చు" నని వ్రాసిన ఉత్తరమునకు బదులుగా రంగాజీ నాకు ఉత్తరము వ్రాస్తూ నేను ప్రభుత్వము పనుపుపయిన వచ్చినవాడిని అలాంటి అక్రమ ధనార్జన చేయటము తప్పని, ఆలాంటి డబ్బుతో పార్టీని బలపరుచుకోవటముకన్న పార్టీని విరమించు కోవటమే మంచిదని గట్టిగా హెచ్చరిక చేస్తూ ఉత్తరము వ్రాశారు. ఇది వారి సత్యశీలతకు నిదర్శనము.

శ్రీ ఆచార్యరంగాజీ బహు గ్రంథకర్త. వారి గ్రంథాలు చదువుతుంటే ఉత్సుకత, సేవాతత్పరత, జాతీయ, అంతర్జాతీయ విజ్ఞాన సముపార్జనపట్ల ఆసక్తి, ఆవేశము ప్రతి ఒక్కరిలో ప్రజ్వరిల్లుతుంటుంది. కమ్యూనిస్టు సిద్ధాంత కర్తలు "రైతు విప్లవ వ్యతిరేకి" అని వారి సిద్ధాంతాలలో రచించుకుంటే దాన్ని ఖండిస్తూ "*Revolutionary peasant*" విప్లవ రైతాంగం అను పేరిట ఒక ఉద్గ్రంధాన్ని రచించి రైతాంగానికి ఎంతో గౌరవ ప్రతిపత్తిని ప్రసాదించిన రంగాజీని రైతాంగము ఆ నాడు ఈ నాడు ఏ నాడు కూడా మరువలేరు. మరువరాదు.

రంగాగారిని భూస్వామ్య రైతు, పక్షపాతియని కొంతమంది కుహనా రాజకీయవాదులు అంటారు. రంగాగారి రచనలుగానీ వారి ఉపన్యాసాలుగానీ చక్కగా అర్థం చేసుకుని అవగాహన చేసుకొని ఉంటే అలాంటి తప్పుడు నిర్ణయానికి వారురాలేరు. స్వీయ వ్యవసాయదారుడు,వ్యవసాయకూలీ, కమ్మరి, కుమ్మరి, చేనేత, వడ్రంగి మొదలుగాగల కళాకారులు, చేతివృత్తుల వారేకాక చిన్న చిన్న వ్యాపారస్తులు, బుద్ధి జీవులు మొదలగు శ్రమజీవులంతా రంగాగారు నిర్వచించిన రైతాంగములోని భాగస్వాములై ఉన్నారనుట స్ఫటిక సదృశముగా కనపిస్తున్నది. గాంధీగారితో ఆశీర్వాదముపొంది రంగాగారు ప్రవచించిన రైతు కూలీ ప్రజారాజ్యములో పైవారంతా భాగస్వాములై ఉన్నారనుట నిర్వివాదాంశము. స్వీయవృత్తి దారులయిన గ్రామీణ చేతివృత్తుల వారిపట్ల వారి వృత్తులలో యిమిడియున్న అనల్పశిల్పనా ప్రభావముపట్ల వారికెంతో అభిమానము. స్వీయ వృత్తిదారుల అభ్యున్నతే దేశాభ్యున్నతి అని, స్వీయ వృత్తిదారులు *Self Employed sector*'' అను పుస్తకమును రచించి, పంచశిల్పి అయిన మానాన్న గారు గురు లింగాచారిగారికి ఆ పుస్తకమును అంకితముచేసి కళాకారులపట్ల వారికున్న అభిమానాన్ని ప్రదర్శించుకున్నారు.

దురదృష్టవశాత్తు ఆయనను కులతత్వవాదిగా కొంతమంది చిత్రించటము కూడా కద్దు. ఆయనను గురించి తెలిసినవారెవ్వరూ అలాంటి అప్రాచ్యమయిన ఆలోచనకుపోరు. ఆయన శిష్యరికములో పెరిగి పెద్ద అయినవారు ఆయన కులమువారు ఎవ్వరూలేరు. శ్రీ కందుల ఓబుల్‌రెడ్డి, శ్రీ తిమ్మారెడ్డి, స్వర్గీయ చేగిరెడ్డి, బాలిరెడ్డి,గౌతు లచ్చన్న,*V. L.* సుందరరావులాంటి మరియు నాలాంటి వారెవ్వరూ ఆయన కులము వారు కారు. ఆయన కుల, మత, వర్గ, వర్ణ రాహిత్యాన్ని కాంక్షించే ఆధ్యాత్మిక చింతనా ప్రవృత్తికల మహామనీషి

ఆయన తలవంచని వీరుడు,తాను నమ్మిన, ప్రవచించిన రాజకీయసిద్ధాంతాలపట్ల ఏదయినా అపకృతి జరిగినపుడు సహించక ఎదిరించి నిలబడి ఏ పార్టీ పెట్టినా, ఏ ఉద్యమము నిర్వహించినా ప్రజాస్వామ్యానికి, జాతిసమైక్యతకు, జాతి సమగ్రతకు, సత్యహింసలకు భిన్నముకాని రీతిన 55 సంవత్సరముల సుదీర్ఘమయిన పార్లమెంటరీ వ్యవస్థను కలిగి దేశములోనేకాక ఇతర దేశములలో సయితము వేనోళ్ళ పొగడబడి దేశానికి కీర్తి ప్రతిష్ఠలు సంపాదించిన ప్రజాస్వామిక రాజకీయ దేశికోత్తముడై తన రాజకీయ జీవితాన్ని నిష్కళంకంగా బాపూజీ అడుగుజాడలలో నిర్వహిస్తున్న ఉత్తమ రాజకీయ పరిజ్ఞాత నేత.

మన ప్రియతమ నాయకురాలు శ్రీమతి ఇందిరాగాంధీకి సలహాదారుడుగా ఉండి ఉండటమేగాక ఆమె చనిపోయిన వెంటనే ఆమె తరువాత పార్లమెంటులో Deputy Leader గా ఉండిన రంగాగారు వెంటనే పెద్దలను కలుసుకొని మన ప్రియతమ యువనాయకుడు శ్రీ రాజీవగాంధీని ప్రధానిగా ఎన్నికచేయటములో వారిపాత్ర అనన్యము. సమయోచితము. తిరిగి వారు ఈరోజుకూడా పార్లమెంటులో డిప్యూటీ నాయకుడుగా ఎన్నికై మన ప్రధానికి సముచితమయిన సలహాలందిస్తూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నందుకెంతో ముదావహము. వారి 88వ జన్మదినోత్సవము విజయవంతము కావాలని వారికి దీర్ఘ ఆయురారోగ్యాల ప్రసాదించాలని దేవుని ప్రార్థిస్తూ వారికి శిష్యుడుగా, పుత్ర సమానుడుగా వారికి నా హృదయపూర్వక నమస్సుమాంజలులు సమర్పిస్తూయున్నాను.

# మహోద్యమ నాయకులు

—పసుపులేటి కోటేశ్వరరావు

(మాజీ ప్రధాన కార్యదర్శి: ఆం.ప్ర. కాంగ్రెసు కమిటీ (ఐ) )

నిస్వార్థంతో, సేవా త్యాగాలతో దేశ స్వాతంత్ర్య సమరంలో తమ్ము తాము సమిధలుగా అర్పించుకున్న మహనీయులు ఎందరో! అట్టివారిలో ఆచార్య రంగాజీ ఒకరు.

గాంధీజీ దృష్టిలో నైతిక విలువలు లేని రాజకీయ నాయకత్వం అనూహ్యం. ప్రజా జీవితంలో నిమగ్నమయ్యే నాటివారికి సేవా తత్పరత, త్యాగనిరతి గీటురాళ్ళుగా గాంధీజీ నిర్దేశించారు. ఆ తరానికి చెందిన గాంధేయవాది రంగాజీ.

నాడు గాంధేయ మార్గంలో యే నిరాడంబర వ్యక్తిగత జీవితానికైతే రంగా గారు తన్నుతాను అర్పించుకున్నారో, దానికే అరవై ఏళ్ళ తర్వాత యీనాటికీ ఆయన కట్టుబడి వున్నారు.

చుట్టూ విశృంఖలతో, విజృంభణతో రోజురోజుకూ మారిపోతున్న యీ మానవారణ్యం మధ్య- ఆనాటి గాంధేయ తత్వానికి, నిరాడంబరతకు, ప్రతీకలుగా నిన్న మొన్నటి వరకూ ఒక జయప్రకాష్, ఒక వినోబా- ఇవాళ్టి వరకూ ఒక నంబూ, ఒక రంగా- ఇంకా ఇలాంటివాళ్ళు అక్కడక్కడ మిగిలి వున్నారు. మానసికంగా సర్వసంగ పరిత్యాగం చేసి, ప్రజాసేవా ధ్యానంలో మునిగిపోయిన తపస్వాలి రంగాజీ. గాంధీజీ బాటలో, గాంధేయ వాదంతో నాటికి నేటికీ ముడిపడి

పోయి, నాటి సేవా త్యాగాలు, నిరాడంబరతలే నేటికీ లక్ష్యాలుగా నిల్పుకుని 'యీ దరిద్రనారాయణుల శ్రేయస్సుకై గాంధీజీ కన్నకలలు యెలా నిజం చేయాలా' అని అహర్నిశలూ తపనపడే కర్మయోగి ఆయన.

ఈనాటి దిగజారిపోయిన విలువలతో తూచడానికి రంగాగారు ఊహామాత్రంగానైనా అందరు. అందుకే ఆయన చేసేదీ, చెప్పేదీ యీనాటి తరంలో చాలామందికి అర్థం కాదు. అవగాహన అంతకంటే లేదు. ఆయన కటు మందలింపుల వెనకగల మమతానురాగాల మనసు వీరికి యెలా అర్థమవుతుంది!

గాంధీజీకి, గాంధేయ తత్వానికి దేశంలో ఇంకా మిగిలివున్న అతి కొద్దిమంది ప్రథమశ్రేణి ప్రతీకల్లో రంగాగారు ఒకరు. ఆయనకు సమకాలీనులు కావటం అదృష్టం. అనుచరులు, సన్నిహితులు కావటం మరీ అదృష్టం!

గాంధీజీ దేశాభివృద్ధికీ గ్రామాభివృద్ధికీ అవినాభావం చేశాడు. ఈ అవినాభావ సంబంధాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకున్న అతికొద్దిమంది అగ్రశ్రేణి నాయకుల్లో రంగాగారు ఒకరు.

"పార్లమెంటులో రంగా వుండగా రైతుల్ని యెలా విస్మరించగలం" అన్నాడు ఒకనాడు పండిట్ నెహ్రూ. యెంత గొప్ప సత్యం! ఇంకా గొప్ప సత్యం యేమంటే- పార్లమెంటులో రంగాగారు లేకుండా బయటనే వున్నా; అసలు ఆయనంటూ వుండగా ప్రభుత్వం- అది యే ప్రభుత్వమైనా- రైతుల్ని విస్మరించటం అసాధ్యమన్న నిజం!!

రైతాంగ శ్రేయస్సునీ, గ్రామీణ వికాసాన్నీ ప్రభుత్వాలు విస్మరించకుండా అప్రమత్తుడై ఆయన చక్రం అడ్డువేస్తూ వస్తున్నాడు.

కమ్యూనిస్టు దేశాలు నేడు 'రైతు' ను వ్యక్తిపరంగానే 'రైతుగా' గుర్తించే వ్యవస్థ చేరువకు చేరుకుంటున్నాయి. అందుకే 'రైతు'కు చావులేదు. యెవరూ, యే వ్యవస్థా, యే సిద్ధాంతమూ రైతును చంపలేదు. ప్రపంచ పరిణామంలో యెదురౌతున్న యెన్నో వ్యవస్థలను, పరిస్థితులను తట్టుకుని 'రైతు' తన్నుతాను నిల

దొక్కుకుని నిలబడుతున్న సజీవ తత్వమే నిజమైన రివల్యూషనరీ తత్వం. అందుకే రంగాజీ రైతుకూలీ శ్రామిక ప్రజారాజ్యంగా ప్రచారం చేశారు.

సమూలంగా నాశనమయ్యే గ్రామీణ వ్యవస్థను రక్షించు కొనేందుకే ఆయన 1955 లో కాంగ్రెసును సమర్థించారు. మళ్లా 1959 లో కాంగ్రెసు నాగపూరు మహాసభలో సహకార వ్యవసాయం (Cooperative Farming) అమలుపై ఆమోదముద్ర వేసింది. గ్రామీణ వ్యవస్థను కూకటి వేళ్ళతో పెకలించే రైతాంగ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించారు రంగాజీ. తిరిగి ఆ గ్రామీణ వ్యవస్థను యీ ప్రమాదం నుంచి తప్పించడానికే 1959 లో రంగాగారు రాజాజీతో కలసి, స్వతంత్ర పార్టీని స్థాపించారు.

రంగాజీ మారలేదు. పార్టీలు పెట్టాడు. అందుకు చాల ధైర్యం కావాలి. సాహసం కావాలి. నిస్వార్థ ప్రజాశ్రేయో చింతన కావాలి. అవసరమైతే తన్ను తాను సమిధను చేసుకోగల చిత్తశుద్ధి, ఆత్మ సంయమనం కావాలి. రంగాగారు పెట్టిన పార్టీలన్నీ సిద్ధాంతపరమైనవే. గ్రామీణ వ్యవస్థకు ముప్పు తేగల పరిణామాలను పసిగట్టినప్పుడు - తాను అప్పుడు వున్నది యెంత గొప్ప అధికార పార్టీ అయినా, అందులో తనకున్న ప్రతిపత్తి యెంత ప్రాముఖ్యమైనదైనా- తృణ ప్రాయంగా వాటిని వదిలి, బయటకు వచ్చి, ఆ గ్రామీణ వ్యవస్థను పరిరక్షించుకునే పరికరాలుగా ఆయన క్రొత్త పార్టీలను పెట్టాడు. ఆ పరికరాల ద్వారా ఆందోళనలు, ఉద్యమాలు నడిపాడు. గ్రామీణ ప్రజల్ని, వారి శ్రేయోకాముల్ని చైతన్యవంతుల్ని చేశాడు. చివరకు ఇంతవరకూ ఆ గ్రామీణ వ్యవస్థను రక్షించుకుంటూ రాగలిగాడు.

స్వతంత్ర గ్రామీణ వ్యవస్థకు పునాదులనుండీ అడ్డు నిలచేది జమీందారీ వ్యవస్థ. యీ వ్యవస్థను రద్దు చేయించేందుకు రంగాగారు యెన్నో జమీందారీ వ్యతిరేక ఉద్యమాలు నడిపారు. తాము స్వయంగా పాల్గొన్నారు. ఆనాటి ఆ ఉద్యమాల ఉధృతి యెంతటి దంటే- కొందరు జమీందార్లు ఆయన ప్రాణాలకే ముప్పు పెట్టే ప్రయత్నాలు చేశారు. జమీందారీ వ్యతిరేక ఉద్యమాలను ఆయన నడిపింది, స్వతంత్ర రైతాంగ వ్యవస్థనూ, గ్రామీణ వ్యవస్థనూ నిల్పబెట్టి ప్రోది చేసేందుకే.

1969 వ సంవత్సరం. కాంగ్రెసు రెండుగా చీలిపోయింది. పాతుకుపోయి వున్న పాత కాంగ్రెసు నాయకత్వానికి ఎదురుతిరిగి ఇందిరాజీ నిలదొక్కుకుంది. ప్రివీపర్సుల్ని రద్దు చేసింది. బ్యాంకుల్ని జాతీయం చేసింది. అప్పటివరకూ బ్యాంకులూ, వాటిలోని ధనమూ, పెద్ద పారిశ్రామిక వేత్తలకూ, వ్యాపారులకూ, ఇతర ధన స్వాములకూ మాత్రమే వినియోగపడుతూ వచ్చింది. బ్యాంకులపై వారిదే గుత్తాధిపత్యం. ప్రజల ధనాన్ని బ్యాంకుల ద్వారా తమ స్వప్రయోజనాలకు స్వాహా చేస్తూ ఇంకా బలిసిపోతున్నారు. బ్యాంకుల్ని జాతీయం చేయడంతో ఒక్కకలం పోటుతో ఇందిరాజీ ఇదంతా మొత్తం మార్చేసింది. ఇప్పుడిక యీ జాతీయ బ్యాంకులన్నీ ప్రజలవద్దకు దిగి వచ్చాయి. సన్నకారు పేదరైతులకు తక్కువ వడ్డీలకు ఋణాలివ్వడం మొదలైంది. రిక్షా కార్మికుడికీ, చిన్న చిన్న వ్యాపారస్తులకీ, వెనుకబడిన బడుగు వర్గాలవారికీ యీ బ్యాంకులు అండగా నిలబడసాగాయి. ప్రజల ధనం ప్రజలకే వినియోగపడి సార్థకతపొందే స్థితి వచ్చింది. పెద్ద పెద్ద ధనస్వాములంతా గగ్గోలు పెట్టారు. ఇందిరాజీపై కత్తికట్టారు. ఆమెను పడగొట్టాలని సర్వస్వం ఒడ్డడానికి సిద్ధపడి యెగబడ్డారు. సామాన్య జనాలకోసం ఇందిరాజీ చేపట్టిన ఇంకా అనేక సంక్షేమ కార్యక్రమాలు పేదసాదల్ని చైతన్యవంతుల్ని చేయటం వారికి కంటగింపైంది. ఇందిరాజీ ధైర్యానికి, స్థైర్యానికి, సాహసానికి ప్రతీకగా నిలబడింది. అందుకే రంగాజీ ఇందిరాజీ నాయకత్వ సామర్థ్యానికి ప్రాధాన్యం ఇచ్చి 1971 నుండి ఆమెను బలపరుస్తూ వచ్చారు.

దేశంలోని దరిద్రనారాయణులు ఆత్మధైర్యంతో స్థైర్యంతో నిలదొక్కుకునేలా, దేశ వ్యవస్థలో ప్రముఖ భాగస్వాములుగా వారిని తీర్చి దిద్దే ఇందిరాజీ కార్యక్రమాలనూ, నాయకత్వాన్నీ బలపరచడమే ఆయన ధ్యేయం. ఆ పనే చేసుకుంటూ పోయాడాయన.

ఆయనకు రాజకీయం పదవులకొరకై జరిపే వ్యాపారం కాదు. ప్రజాశ్రేయస్సుకై జరిపే యోగం. ఆ యోగ దీక్షలో వున్న ఆయనకు యీ దూషణ భూషణలేవీ అంటవు. తాను విశ్వసించినదాన్ని ఆచరించటంలో ఆయన్ను యేదీ ఆపలేదు. ఏవీ అడ్డంకులు కాలేవు. ఆచరణాత్మక గాంధేయ తత్వం ఆయనది!!

1978 జనవరి 1 కాంగ్రెసు మళ్ళీ చీలింది. చీలిక నివారించడానికి రంగా గారు యెంతో ప్రయత్నించారు. పార్టీకి అసలు నాయకురాలు ఇందిరాజీయే అని. ఆనాడు పార్టీ పదవుల్లో వున్న, వారిచే గుర్తింపచేయడానికి యెంతో ప్రయత్నించారు.

అక్షణమే ఆయన ఇందిరాజీ ప్రక్కన నిలబడ్డారు. ఇందిరాజీ రాజకీయ భవిష్యత్తు యేమిటో యెవరికి అంతుచిక్కని రోజులు అవి. కేంద్రంలో, రాష్ట్రంలో వ్యతిరేక ప్రభుత్వాలు. ఆమెపై ఎన్నో కేసులు. అరెస్టులు. షా కమీషను విచారణలు. రాజకీయంగా వెంటాడబడి వేధించబడుతున్న రోజులు ఆమెకు అవి. 1978 లో రాష్ట్రంలో కాంగ్రెసు (ఐ) గెలుస్తుందని గాని, 1980 లో కేంద్రంలో గెల్చి ఇందిరాజీ తిరిగి అధికారంలోకి వస్తుందనిగానీ యెవరూ కలలోకూడా వూహించని రోజులు అవి. అంతవరకూ ఆమెతో వున్న యెందరో ఆమెను వదలి తమ రాజకీయం తాము చూసుకుంటున్న రోజులు. ఆమెకూ, ఆమెతోనే నిలబడ్డవారికి అంధకార బంధురమైన గడ్డు రోజులు. అట్టి గడ్డు స్థితిలో ఆమెకు రంగాజీ అండగా నిలిచారు.

ప్రతిఫలాన్ని ఆశించకుండా దేశం కోసం, ప్రజలకోసం ఏమి చేయాలను కున్నారో దానికొరకు త్రికరణ శుద్ధిగా అంకితమైన ఉన్నత వ్యక్తిత్వం గలవారు రంగాజీ. ఈ ప్రయత్నంలో అవరోధాలను ఆయన లక్ష్యపెట్టరు. పదవులలో వుండి పెత్తనాలు చేసి ప్రపంచంలో పేరు తెచ్చుకున్న వ్యక్తికాదు రంగాజీ. ప్రజాబలంతోనే ప్రపంచ గుర్తింపు పొందిన మహానాయకుడు రంగాజీ. ప్రపంచ వ్యాప్తంగా వారికి అందుతున్న కీర్తి పదవులవల్ల సాధ్యమయ్యేది కాదు. 86 వ ఏట కూడ రంగాజీ ఎంతో తేజస్సుతో, నిండు హృదయంతో, ఎన్ని సవాళ్ళు ఎదురైనా తట్టుకుంటూ నిలబడ్డ ఆదర్శమూర్తి రంగాజీ. ఆయన నిండు నూరేళ్ళు జీవించి ప్రజాసేవకు అంకితం కావాలని భగవంతుని ప్రార్థిస్తున్నా.

# ధవళగిరి శిఖరం శ్రీ రంగా

—వెల్లంకి చంద్రపాల్
(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రజాసమాఖ్య
ప్రధాన కార్యదర్శి)

భారత పార్లమెంట్ మహత్తర చరిత్రకు అక్షరరూపం యివ్వగలిగిన బహుకొద్ది మంది పార్లమెంటేరియన్‌లలో ప్రథమ స్థానంలో నిలువగలిగిన ప్రజ్ఞా నిధి, విజ్ఞానఖని ఆచార్య ఎన్. జి. రంగా.

భారత స్వాతంత్ర్యోద్యమంలోని ఉజ్జ్వలమైన, ఉత్తేజకరమైన అధ్యాయాలు కొన్ని అప్పటి కేంద్ర శాసనసభలో (ఆనాటి పార్లమెంట్) విరచితమైనవి. అదొక ప్రత్యేకమైన, మహత్తర చరిత్ర. అప్పుడు యాభై సంవత్సరాల క్రిందట-యువ నాయకునిగా, యువమేధావిగా శ్రీ ఎన్. జి. రంగా కేంద్ర శాసనసభలో నిర్వహిం చిన సమరోచిత పాత్ర చిరస్మరణీయమైనది.

ఈ ఏబది నాలుగు సంవత్సరాల పార్లమెంటరీ సేవాజీవితంలో శ్రీ రంగా అఖిలభారత స్థాయి నాయకునిగా అంతర్జాతీయ ప్రసిద్ధ మేధావిగా, మహామనీషిగా, రాజకీయ, సామాజిక తాత్వికునిగా జాతీయ జీవనంలో అనేక కార్యక్రమాల్లో బహుముఖంగా సుసంపన్నమైన పాత్ర వహించారు.

జాతీయోద్యమకాలంనాటి అతిరథ మహారథులలో మనకు మిగిలివున్న బహుకొద్దిమందిలో ఆచార్య రంగా అగ్రగణ్యులు. అనేకానేక ప్రజోద్యమాలను

రూపొందించి, నిర్మించి, నేతృత్వం వహించారు. ఎప్పటికప్పుడు ఆయన అత్యంత ఆధునికుడు. ఆలోచనలతో, భావ తీవ్రతలో, కాలానికంటె ముందున్న ఆశయాల ఉద్ధృతికి కట్టెంవేసిన విప్లవ గుణశీలి. సమున్నత సంస్కర్త. సమకాలీన రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యల గురించి ఆచార్య రంగా నేటికీ ఎన్నో నివేదికల రూపంలో ప్రకటనలద్వారా తమ అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడిస్తున్నారు. ఆయన జీవితమే ఒక ఉద్గ్రంథం.

ఉపన్యాసాలు జలపాతరాగాలు. ఎన్నో ఉత్కృష్టమైన పరిశీలనా గ్రంథాలను రచించారు. ఆయన రచనా వ్యాసంగం బహుముఖమైనది-ఆలోచనాత్మకమైనది. శ్రీ రంగా లేఖిని నుండి వెలువడిన గ్రంథాలు విజ్ఞాన ఖండికలుగా విలువను, విశిష్టతను సంతరించుకున్నాయి. ప్రజాభిప్రాయమే అన్ని చట్టాలకు, సకల శాస్త్రాలకు ప్రాణం అనే ప్రగతిపూర్వక సిద్ధాంతంలో ప్రగాఢమైన విశ్వాసం వున్న పూర్తి ప్రజాస్వామ్యవాది శ్రీ రంగా.

అఖిలభారత స్థాయిలో ఆచార్య రంగా అభేద్యమైన రైతు ఉద్యమ నిర్మాత. తెలుగునాట ఎందరెందరో అతిరథ రాజకీయవేత్తలకు ఆచార్యత్వం వహించిన అగ్రశ్రేణి మేధావి. మాటలలో, చేతలలో స్వచ్ఛమైన గాంధేయవాది. 'సత్యం, శివం, సుందరం' సూక్తి ఆచార్య రంగాపట్ల సార్థకం. అన్ని అభ్యుదయోద్యమాలతో సన్నిహిత సంబంధం కలిగిన ఆచార్య రంగా నవయువతకు 'ఆశీస్సు'.

అంతర్జాతీయ స్థాయి విద్యావేత్తగా, శేముషీ సంపన్నునిగా పూలపాన్పు వంటి వైభవోపేతమైన జీవితం గడపవలసిన శ్రీ రంగా సామాన్య కర్షక, గ్రామీణ పేద ప్రజాలోకంలో తాదాత్మ్యం పొంది ప్రజాబంధువుగ నిలిచిపోయారు. అది ఆయన త్యాగ పరాయణత్వానికి; చిత్తశుద్ధికి, అనయతిరతికి హిమశిఖరం వంటిది.

శ్రీ ఎన్.జి. రంగా 1900 వ సంవత్సరం నవంబరు 7 వ తేదీన గుంటూరు జిల్లా నిడుబ్రోలులో జన్మించారు. ఇరవై సంవత్సరాల యవ్వనాంకుర దశలో 1920 లో ఇంగ్లండు వెళ్ళి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రంలో ఆయన బి.లిట్ తీసుకొన్నారు. 1927-30 లో మద్రాస్ పచ్చయప్ప కళాశాలలో

చీఫ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. అప్పుడు శ్రీ అన్నాదురై వంటి ప్రముఖులెందరో ఆ కళాశాలలో శ్రీ రంగాకు శిష్యులు. 1928 లో ఆచార్య రంగా మద్రాసు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారుగా వ్యవహరించారు.

సాకల్యమైన పరిజ్ఞానంతో, క్షుణ్ణమైన అధ్యయనంతో 'కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్య' సిద్ధాంతాన్ని ఆపోశనం పట్టిన శ్రీ రంగా 1929లో బ్రిటిష్ ప్రభుత్వం నియమించిన రాయల్ కమిషన్ ముందు వ్యవసాయకూలీలకు కనీస వేతనాలను నిర్ణయించే చట్టం కావలెనని ఆందోళన చేశారు.

1930 లో సత్యాగ్రహోద్యమానికి గాంధిజీ యిచ్చిన పిలుపును పురస్కరించుకొని 'ఆచార్య' పదవికి రాజీనామాచేసి, స్వాతంత్ర్యోద్యమ నాయకులైనారు.

1933 లో దేశవ్యాప్తంగా రైతు-కూలీ రక్షణయాత్ర సాగించి, గ్రామీణ రైతు, వ్యవసాయ కూలీల స్వయంపోషక శక్తికి విప్లవాత్మకమైన ఆర్థిక సూత్రాలను ప్రబోధించారు. జవహర్‌లాల్‌నెహ్రూ, జయప్రకాశ్ నారాయణ్, ఆచార్య నరేంద్రదేవ్ తదితరులతో 1934లో ప్రారంభమయిన 'కాంగ్రెసు సోషలిస్టు ఫోరమ్'లో ఆచార్య రంగా కార్యవర్గ సభ్యులు. 1930 లో మొదటిసారిగా సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో మహాత్మాగాంధిని రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సుకు ఆహ్వానించితీరాలని డిమాండుచేస్తూ గొప్ప ఉపన్యాసం చేశారు. తిరిగి 1934-35 లో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1936 లో శ్రీ రంగా నాయకత్వంలో 'కిసాన్ సభ' అవతరించింది.

1936 లో 'వాహిని' పత్రికను నెలకొల్పారు శ్రీ రంగా. 1940, 1942 సంవత్సరాల జాతీయ సమరంలో శ్రీ రంగా కారాగార క్లేశాన్ని అనుభవించారు. 1945 లో శ్రీ రంగా రైతు-కూలీ ప్రజారాజ్యం నినాదంతో గాంధీజీతో జరిపిన చర్చలు చరిత్రాత్మకమైనవి. అఖిలభారత కిసాన్ సమ్మేళన్, అఖిల భారత చేనేత కాంగ్రెస్, ఆక్స్‌ఫర్డ్‌లో ఇంటర్నేషనల్ లేబర్ గ్రూప్, అఖిలభారత గ్రామీణ ప్రజాసమాఖ్య వంటి పెక్కు ప్రజాహిత సంస్థలను ఆచార్య రంగా నెలకొల్పారు.

1946-51 లో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడుగా, కేంద్రశాసన సభా కాంగ్రెసుపార్టీ కార్యదర్శిగా పనిచేశారు. ఆచార్య రంగా 1958 లో కాంగ్రెస్ పార్లమెంటరీపార్టీ కార్యదర్శిగా, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ అధ్యక్షునిగా, నిర్మాణాత్మకమైన కృషిచేశారు.

1962 నుండి దశాబ్దకాలంపాటు శ్రీ రంగా అఖిల భారత స్వతంత్ర పార్టీకి అధ్యక్షులు. ఈ కాలంలో లోక్‌సభ సభ్యులుగా ఆచార్య రంగా రైతుల, గ్రామీణ పేదప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. 1972లో శ్రీ రంగా తిరిగి కాంగ్రెస్‌లో పునః ప్రవేశించారు.

1978 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం 'డాక్టరేట్' బిరుదును ఇచ్చి ఆచార్య రంగాను గౌరవించింది. ఆంధ్రా యూనివర్సిటీ పొలిటిక్స్‌లో, పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్‌లో ప్రధాన గౌరవ ప్రొఫెసరుగా ఆయనను నియమించి గౌరవించారు.

1980 జనవరిలో లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో ఆచార్య రంగా కాంగ్రెసు (ఐ) అభ్యర్థిగా గుంటూరునుండి విజయాన్ని సాధించారు. 1980 సెప్టెంబరులో ఆచార్య రంగా లోక్‌సభలో కాంగ్రెస్ (ఐ) పార్లమెంటరీ పార్టీ డెప్యూటీ లీడరుగా ఎన్నికైనారు. 1980 అక్టోబరు 11వ తేదీన భారత ప్రతినిధి వర్గ సభ్యునిగా, ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాలలో పాల్గొనేందుకు న్యూయార్కు వెళ్ళి రెండు నెలలపాటు అక్కడ వివిధ సభలలో ప్రసంగించారు.

1981 నవంబరు ఏడవ తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరణ రజతోత్సవాల సందర్భంగా ఆచార్య రంగాకు హైదరాబాదులో ఘన సన్మానం జరిగింది. ప్రతి సంవత్సరం నవంబరు ఏడును 'రైతు దినోత్సవం' గా జరపాలని తీర్మానించారు. 1982 లో ఆచార్య రంగా 50 సంవత్సరాల పార్లమెంటరీ సేవాజీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి, స్పీకర్ శ్రీ బలరామ్ జక్కర్‌లు ఢిల్లీలో సన్మానించారు.

లోక్‌సభ సభ్యులుగా శ్రీ రంగా నిర్వహించిన పాత్రను అన్ని పక్షాలవారు ప్రశంసించారు. 1985 లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో గుంటూరునుండి తిరిగి ఎన్నికయిన శ్రీ రంగా ఆ తరువాత లోక్‌సభలో పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా ఎంపికయ్యారు. పార్లమెంటు భీష్ముడుగా కీర్తి నార్జించిన శ్రీ రంగా నేటికీ 'ధవళగిరి శిఖరం' వలె పార్లమెంట్‌కే గర్వకారణంగా వెలుగొందుతున్నారు.

'వృద్ధమూర్తి' అనే విశేషణం ఆచార్య రంగా వయస్సుకు మాత్రమే వర్తిస్తుంది. కాని మనస్సుకు కాదు. నేటికీ సునిశిత బుద్ధితో, విజ్ఞతా సంపదతో ప్రజాసేవకు అత్యంత ప్రయోజనకరంగా అంకితమయ్యే వున్నారు.

శ్రీ పి. జగదీశ్వరరావు

# విజయోత్సవం

తెలుగుబిడ్డగా జన్మించి భారతరాజకీయాలలో ప్రముఖపాత్రవహించిన మేధావి ఆచార్య రంగా. ఆయన కాకలుదీరిన స్వాతంత్ర్యసమరయోధుడు. అచ్చపు గాంధేయ వాది, ప్రాచ్య పాశ్చాత్యభాషాసాగరాలను పుక్కిటబట్టిన అగస్త్యుడు.

లండనులో విద్యాభ్యాసంచేసి వచ్చి మద్రాసు పచ్చయప్ప కళాశాలలో అర్థికశాస్త్రాచార్యులుగా శ్రీ రంగా పనిచేశారు. ఆయన వాగ్ధాటి నయాగరా జలపాతం.

రమారమి ఏబదిఐదు సంవత్సరాలు పార్లమెంటు సభ్యుడుగా ఆచార్యరంగా చేసిన ప్రజాసేవ ప్రశంసనీయం. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంటుగా పార్టీకి ఎన్నదగిన పురోగతిన్ని సాధించారు. మహామేధావి శ్రీ సి. రాజగోపాలాచారిగారికి అత్యంత సన్నిహితుడుగా నుండి స్వతంత్రపార్టీ నిర్మాణంలో మహత్తరకృషిచేశారు. ఆయన నిజంగా ఒక రాజకీయ విజ్ఞాన సర్వస్వం. స్వర్గీయ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధిచే ఆదర్శ పార్లమెంటు సభ్యుడుగా శ్లాఘ పొందిన మహామనీషి.

పూజ్య ఆచార్య రంగా బహు గ్రంధకర్త. అనేక పరిశోధనాగ్రంథాలను అంకితముగాన్న సాహితీమూర్తి. గోభూమిలో నివసిస్తూ రైతుబాంధవుడుగా

కృషీవలుల అభ్యున్నతికి తోడ్పడుతూ రాజకీయదేశికోత్తముడై సమర్థులైన శిష్యవర్గాన్ని తయారుచేశారు.

ఈనాటి ఇండియన్ పార్లమెంటు అధికారపార్టీ డెప్యూటీ లీడర్ పదవిని ఆదర్శవంతంగా నిర్వహించు గౌరవనీయులు ఆచార్యరంగాగారి ౮౬వ జన్మదినోత్సవం భారతదేశమునకే విజయోత్సవం కావాలనీ వారికి చిరాయురారోగ్యములు కలగాలనీ ఆకాంక్షిస్తున్నాను.



# కార్యకర్తలను నాయకులుగా రూపొందించిన ఆచార్య రంగాజీ

మండలి వెంకటకృష్ణారావు
కార్యదర్శి,
ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ సంఘము.

ఆంధ్ర రాష్ట్రంలో నిడుబ్రోలులో రైతాంగ విద్యాలయం పెట్టి సుశిక్షితులైన కాంగ్రెస్ కార్యకర్తలను తయారుచేసిన ఘనత శ్రీ రంగా గారికే దక్కుతుంది. శ్రీ సంజీవరెడ్డి, వారిలో కొంతమంది యువకులకు రాజకీయంగా ప్రోత్సాహం ఇవ్వడం వలన అనేక పదవులను అధిష్ఠించి పార్టీలోనూ, పరిపాలనలోను దక్షతను చూపించినారు. నేటి అనుభవజ్ఞులైన రాజకీయతరంలో చాలా మంది వారిరువురి ప్రోత్సాహం వలన పెరిగినవారే. అట్టివారిలో నేనొకర్ని.

1940లో అవనిగడ్డ హైస్కూలులో చదువుకొంటున్నాను. వ్యక్తిగత సత్యాగ్రహం జరుపుతున్న రోజులు. శ్రీ యేలేశ్వరపు కృష్ణమూర్తి అవనిగడ్డ బజారులో పార్కు వద్ద సత్యాగ్రహం చేస్తున్నారన్నారు. హైస్కూలునుండి విద్యార్థులం పరిగెత్తాము. జనం కూడా చాలా మంది గుమికూడారు. సత్యాగ్రహం చేస్తున్న శ్రీ కృష్ణమూర్తికి దండలువేశారు. గుర్రంపై సబ్‌ఇన్‌స్పెక్టరు శ్రీ పాణి వచ్చారు. అతనంటే ప్రజలకు భయం. యముడులాగా వచ్చాడురా అంటూనే వున్నారు. మారో అని అన్నారు. పోలీసులు లాఠీఛార్జీ ప్రారంభించారు. నాకు

దెబ్బలు తగిలాయి. లాఠీఛార్జీలో దెబ్బలు తగిలినాయి అని తెలిసి విద్యార్థులు, కాంగ్రెస్ పెద్దలు పరామర్శచేయడానికి వచ్చారు. అదే చాలామందితో పరిచయానికి, రాజకీయ ప్రవేశానికి ప్రారంభం. అప్పటినుంచి శ్రీ యేలేశ్వరపు కృష్ణమూర్తి నన్ను వదిలిపెట్టేవారు కాదు. శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య గారితో పరిచయము అయ్యింది. ఆ ప్రాంతానికి ఎప్పుడు వచ్చినా వారివెంట త్రిప్పుతూ ఉండేవారు.

1942 ఆగస్టు క్విట్ ఇండియా తీర్మానంతో కాంగ్రెస్ సంస్థను నిషేధించి కాంగ్రెస్ నాయకులను దేశం నలుమూలలా అరెస్ట్‌చేసి జైళ్లు నింపారు. అజ్ఞాతవాసంలోవుండి అనేకకార్యకలాపాలను చేసేవారము. జాతీయవిద్యార్థిసంఘానికి నన్ను అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. పోలీసులు నిఘా వేశారు. హైస్కూలులో రాత్రిపూట జండాకట్టి, కాగితాలు అంటించివస్తూంటే అరెస్టుచేసి, లాఠీలతోకొట్టి వదలి వేశారు. ఆచార్య రంగాగారి పేరును బాగా వింటుండేవారము. కాంగ్రెస్ నాయకులు జైళ్లలో వుండుట వలన కమ్యూనిస్టులు ప్రజాయుద్ధం పేరుతో ప్రభుత్వాన్ని బలపరుస్తూ, నిత్యావసర వస్తువుల పంపిణీ పేరుతో ప్రజలలో చొరబడినారు. కాంగ్రెస్‌వాదులపై దౌర్జన్యాలను చేస్తూ, వారిమీద సి. ఐ. డి. లుగా పనిచేశారు. 1944లో జైళ్లనుంచి కాంగ్రెస్ నాయకులు వచ్చారు. ఆచార్య రంగా, అయ్యదేవర కాళేశ్వరరావు గార్లు ఆంధ్రరాష్ట్రం అంతా తిరిగి కమ్యూనిస్టుల విద్రోహ చర్యలను ప్రజలకు వివరించి చెప్పారు. ఆ తరుణంలో ఆంధ్రప్రదేశ్ పౌరసత్వ కళాశాలను అవనిగడ్డలో నడిపించి శ్రీ రంగాగారిని ఆహ్వానించినాము. శ్రీ రంగాజీ మూడురోజులపాటు మాతోవున్నారు. కాంపు ఆర్గనైజరుగా వారితో సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఆనాటినుండి ఈనాటివరకు వారితో స్నేహ సంబంధాలు పెరుగుతూ వచ్చాయి.

రంగాగారి మీటింగులు దగ్గరలో ఎచట జరిగినా వెళ్తుండేవారము. గోవాడలో జరిగిన రైతు మహాసభకు వెళ్లాము. విద్యార్థి, యువజన, కిసాన్ సభలలో వారు పాల్గొంటూవుండేవారు. ఆ సభలకు వెళ్ళి వారి సందేశాలను వినేవారము. రైతాంగ విద్యాలయానికి వెళ్లాము. వారివలన మా రాజకీయ పరిజ్ఞానాన్ని పెంచుకొనగలిగినాము.

రంగాగారు విదేశాలలో వున్నారు. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులుగా శ్రీ సంజీవరెడ్డి, శ్రీ రంగా పోటీలో మొదట శ్రీ రంగాగార్ని బలపరిచినాము. రెండవసారి వారిరువురి మధ్య పోటీ జరిగినప్పుడు సంజీవరెడ్డిగార్ని బలపరిచినాము. శ్రీ రంగా కాంగ్రెస్‌ను వదిలి కృషికార్ పార్టీని పెట్టారు. శ్రీ సంజీవరెడ్డిగారితో కాంగ్రెస్ పార్టీలోనే వుండిపోయాను. శిక్షణ శిబిరం శ్రీ రంగాగారి దగ్గర నేర్చుకొన్నాను. తూర్పుకృష్ణా కాంగ్రెస్ సేవాదళ్ ఆర్గనైజరుగా 1948లో అవనిగడ్డలో సేవాదళ్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించగా శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు, అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ ఆర్గనైజరు శ్రీ యానాందారు వచ్చారు. 1950 లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా బందరులో యువజన కాంగ్రెస్ శిక్షణా శిబిరానికి ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ సంజీవరెడ్డి వచ్చారు. 1954 లో బందరులో "ఆంధ్ర రైతాంగ విద్యాలయానికి ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు వచ్చారు. జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలకు శిక్షణ శిబిరాలు పెట్టి అనేకమందికి రాజకీయ శిక్షణ యిచ్చాము. శ్రీ రంగాగారు మాకు యిచ్చిన శిక్షణే ఈ శిబిరాల నిర్వహణకు, పెద్దలతో పరిచయానికి కారణము. రంగాగారి రాజకీయాలు ఎలావున్నా వ్యక్తిగతంగా వారిమీద ఎంతో గౌరవంతో ఉండేవాడిని. వారుకూడా నామీద ఎంతో ఆప్యాయతను చూపేవారు. 1957-62 లో పార్లమెంటు సభ్యుడుగా నేను ఉన్నప్పుడు, లోక్‌సభలో ప్రశ్నలు వేసేటప్పుడు, అనుబంధ ప్రశ్నలకు శ్రీ రంగాగారు ఎంతో సహాయకారిగా వుండేవారు. పిలిచి ప్రోత్సాహం ఇస్తూండేవారు. కార్యకర్తలంటే ప్రోత్సాహం ఇవ్వడంలో శ్రీ రంగాగారికి సాటి ఆయనే. మంత్రి అయినపుడు కూడా ఎంతో సన్నిహితంగావుండేవారు.

1977 లో ఉప్పెన వచ్చిన తరువాత దివిసీమ ప్రాంతానికి వచ్చారు. మా సేవా కార్యక్రమాలను చూచి ఎంతో ప్రోత్సాహం ఇచ్చారు. గాంధీజీ కోడలు శ్రీమతి నిర్మలాగాంధీ, మనుమడు శ్రీ కనూగాంధీ, గాంధీ గాంధీక్షేత్రానికి వచ్చారు. స్వచ్ఛంద సేవా సభలకు శ్రీ రంగాగారిని ఆహ్వానించినాను. గాంధీ క్షేత్రంలో, సేవాశ్రమంలో జరుగుతున్న కార్యక్రమాలను చూశారు. ఉప్పెనకు అనాథలైన పిల్లలను పలుకరించి ఓదార్చారు. మా కుటుంబ సభ్యుల ఎడల ఎంతో ఆప్యాయతను చూపారు. ఎప్పుడు కలుసుకొన్నా మా కుటుంబ సభ్యుల యోగక్షేమాలన అడుగుతూవుంటారు.

నా రాజకీయ జీవితంలో మరువలేని వ్యక్తులు ఇరువురు. రాజకీయ శిక్షణ యిచ్చిన శ్రీ రంగాజీ, రాజకీయంగా ప్రోత్సాహం యిచ్చిన శ్రీ సంజీవరెడ్డి. వారి రువురు రాజకీయాలలో ఎలావున్నా చిన్ననాటి నుండి నేనంటే ఎంతో ఆప్యాయ తను చూపి ప్రోత్సాహం ఇస్తున్న పెద్దలు. వారికి సర్వదా కృతజ్ఞతాంజలులను అర్పించుకొంటూ వుంటాను.

శ్రీ రంగాజీ 86 వ జన్మదినోత్సవాన్ని ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శిగా వుండి నిర్వర్తించే అవకాశము కల్గుట నా అదృష్టంగా భావిస్తున్నాను. స్వాతంత్ర్య సమరయోధులుగా, 60 సంవత్సరాలు పార్లమెంటేరియన్‌గా, బహుముఖ ప్రజ్ఞా శాలిగా, అనేక రైతు ఉద్యమాల నిర్మాతగా, కార్యకర్తలను తయారుచేసిన కాంగ్రెస్ నేతగా పేరొందిన శ్రీ రంగాజీకి ఈ శుభసమయంలో నా హృదయ పూర్వక అభినందనలు తెలియజేసుకొంటున్నాను. కాంగ్రెస్ శతవార్షికోత్సవాల సందర్భంగా వారిని సన్మానించుకొనడం నాకు గర్వకారణం. వారు శతజయం త్యుత్సవం జరుపుకొనేవరకు ఆయురారోగ్యములు, శక్తి యుక్తులు కలిగివుండి, కార్యకర్తలకు మార్గదర్శకులుగా వుండాలని నిండు మనసుతో కోరుకుంటున్నాను.

# స్వర్గీయ మంతెన వేంకట్రాజు గారి 1934 సం॥ డైరీనుండి

ఏబది ఐదు సం॥లు పార్లమెంటరీ అనుభవం సంతరించుకొన్న రంగాజీది, ఏబది సంవత్సరములు స్వాతంత్ర్య సమరపోరాట యోధుడుగా గడపిన కీర్తిశేషులు మంతెన వెంకటరాజు గారిది గుంటూరు జిల్లా కావటం మాకు గర్వ కారణం.

వీరి యిద్దరి గ్రామాలు ఒకే బాపట్ల తాలూకాలో ఉన్నాయ్ గూడా! ఒకప్పుడు గుంటూరు జిల్లాలో రెండు జిల్లా బోర్డులుండేవి. ఆనాడు వంగోలు జిల్లా బోర్డులో నిది బాపట్ల తాలూకా. 1936 సం॥లో రంగాగారి సతీమణి కీ॥శే॥ శ్రీమతి భారతీ దేవీ రంగా, వేంకటరాజు గారి సతీమణి కీ॥శే॥ మంతెన అన్నపూర్ణమ్మగారు జిల్లా బోర్డు సభ్యులుగా ఉండేవారు. వీరిరువురి గ్రామాలు నిడుబ్రోలు, మంతెన వారి పాలెం ప్రక్క-ప్రక్కనే ఉన్నాయి. ఒకరిది పొన్నూరు ఫిర్కా. మరొకరిది యాజలి ఫిర్కా-ప్రక్క-ప్రక్కనే.

మంతెనవారి పాలెం నిడుబ్రోలు ప్రజలకు ఎంతో సన్నిహిత సంబంధాలు గలిగి ఉంటాయి. ఒకనాడు 1750 సం॥లో మంతెనవారి పాలెం ప్రజలు బ్రతుకు తెరువుకోసం పశ్చిమ గోదావరి జిల్లానుండి వలస వచ్చినవారు. ఆనాడు యిది ఒక ద్వీపం. అక్కడినుండి బయటపడితే మొదట ఆశ్రయమిచ్చేది చందోలు, ఆ తరువాత నిడుబ్రోలు గ్రామాలు.

ఇంత సాన్నిహిత్యముగల యీ యిరువురి నాయకులను రాజకీయ ప్రకృతి-జాతీయ పోరాటంలో చెరొకవైపు నాయకత్వం వహించే వారినిగా విడ

దీసింది. యిరువురూ కలిసి ఒక ప్రవాహం ప్రక్కనలేరు. అట్లా కలిసి ఉంటే ఆంధ్రదేశ రాజకీయ పరిస్థితులు ఏవిధంగా ఉండేవో!

1934 సం॥లో యిద్దరూ కలిసి పనిచేశారు. మరొకమారు 1957 సం॥లో కలిశారు. ఈరెండు సందర్భాలలో రంగాగారు పార్లమెంటు సభ్యులుగా ఎన్నికయ్యారు.

1933-34 సం॥లు సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా కాంగ్రెసు పార్టీ ప్రజా ఉద్యమాలు నడుపుతున్న రోజులు. మా జిల్లాలోని ప్రముఖ గాంధేయవాది-సీనియరు కాంగ్రెసు నాయకులు అయిన కీ॥ శే॥ గొల్లపూడి శీతా రామశాస్త్రిగారి నేతృత్వములో-గోవాడ గ్రామంలోని దేవాలయంలో హరిజన ప్రవేశము కొరకు ఉపవాసదీక్ష చేయ సంకల్పించారు. మహా శివరాత్రినాడు యీ గోవాడ గ్రామంలో పెద్ద తిరునాళ్ళ జరుగుతుంది. ఇది రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందినది.

## 9-2-1934

ఉదయం 5 గం॥లకు లేచి శాస్త్రిగారు నిత్యకృత్యములు తీర్చి-జపములో కూర్చున్న తరువాత, నేను నిత్యకృత్యములు తీర్చుకొని కావూరు చేరితిని. అచ్చట క్షవరము చేసుకొని, స్నానము చేసి, భోంచేసి ఆశ్రమముకు వెళ్ళితిని. అచట మాట్లాడి, తిరిగి కావూరు గ్రామములో వారితో మాట్లాడి, రామక్రిష్ణయ్య గారితో మాట్లాడితిని. గిన్నెలు రెండు రామక్రిష్ణయ్యగారు తీసుకొని వెళ్ళిరి. నేను గుడ్డలు తీసుకొని మధ్యాహ్నం 3 గం॥లకు బయలుదేరి 4 గం॥లకు గోవాడ దేవాలయమునకు చేరితిని. నేను రాత్రికి గోవాడలో తలసిల కోటయ్యగారి యింట్లో భోంచేసి, లాంతరు పత్రికలు తీసుకొని రాత్రి 8 గం॥లకు దేవాలయమునకు చేరితిని.

## 10-2-1934

ఉదయం యధావిధిగానే ఉన్నది. నేను ఉదయం 10 గంటలకు కోటయ్య గారి యింటివద్ద భోంచేసి అచటినుండి రామక్రిష్ణయ్య, వేంకట క్రిష్ణయ్యగార్లతో

మాట్లాడి 11 గంటలకు గుడిదగ్గరకు వచ్చితిని. మధ్యాహ్నమునకు దేవయ్యగారి రెండో కొమార్దు, తలసిల కోటయ్య, అమృతలూరు నుండి రాపర్ల శివరామక్రిష్ణయ్య వగయిరాలు వచ్చిరి. అందరమూ మాట్లాడుతుండగా రంగాగారు వచ్చిరి. అందరూ కలిసి మాట్లాడుచుండిరి. అంతలో కామయ్యగారు, మునసబుగారు వచ్చి, శాస్త్రిగారిని వాలంటీర్ల పందిరిలోనికి వెళ్ళమనిరి. అక్కడకు కాదు చెరువుకట్ట మీదకైనా వెళ్ళుతాననియు, మీఆజ్ఞ యిష్టము లేకున్ననూ, మిత్రులగుటచేతను, ప్రజలగుటచేతను, ఒప్పుకొనుచుంటిననియు, ఉదయము వెళ్ళవచ్చునాయని శాస్త్రి గారడిగిరి. చెరువుగట్టు మీద పాకలేదు గదా? అంతవరకు వాలంటీర్ల పందిరిలో ఉండమన్నారు.

## 11-2-1934

శాస్త్రిగారి ఉపవాసము యధావిధిగానే ఉన్నది. గుంటూరు నుండి డా॥ చలపతిరావుగారు, డా॥ చిదానందంగారు, నేతి చలపతిరావుగారు, నిడుబ్రోలునుండి యన్. జి. రంగాగారు వచ్చినారు. డాక్టర్లు పరీక్షచేసిరి. ఆరోగ్యము సరిగా ఉన్నదని చెప్పిరి. వారందరూ వెంటనే వెళ్ళిపోయినారు. నేనూ రంగాగారు-గోవాడ వెళ్ళి దేవయ్య, కామయ్యగార్లతో మాట్లాడితిమి. చాలా వ్యతిరేకముగా ఉన్నారు. నేను సాయంత్రమే తిరిగి వచ్చినాను. మావెంట ప్రసాదరావుగారు రానని చెప్పి నారు. రాత్రికి తాత వగైరాలు వచ్చినారు.

## 12-2-1934

మహాశివరాత్రి తిరునాళ్ళ మామూలుగానే ఉన్నది. ఇదివరకు వచ్చినంతగా జనం వచ్చుటలేదు. రంగా యిచ్చటనే ఉన్నాడు. శరణు వచ్చినాడు. శాస్త్రిగారిని చూచుటకు అనేక వందల మంది వచ్చుచుండిరి. పూర్ణ (వేంకట్రాజుగారి భార్య) పిల్లలు వచ్చి హరిజన నిధికి చందాలు వసూలుచేయుటకు ప్రయత్నములు పూర్తి అయినవి.

సాయంత్రము యగ్జిబిషన్ హాలువద్ద బహిరంగ సభ జరిగినది. గిరిరావు ప్రసిడెంటు. మొదట శరణు, తరువాత శివరామకృష్ణయ్య, తరువాత నేను, రంగా మాట్లాడినాము. నేను కొంచెం ఉద్రేకముగానే మాట్లాడితిని.

**15-2-1934**

ఉదయం 7 గం॥లకు మూడు కారుల మీద డా॥ వేంకట్రాప్పు, చలపతి రావు, శరణు, వెంకటప్పయ్య పంతులు, నరసింహాచారి వగయిరాలు వచ్చిరి. గాలీబు వచ్చాడు. అందరమూ దేవాలయమునకు వెళ్ళి ప్రార్థనలు చేసితిమి. గోవాడ నుండి దేవయ్యగారు, వెంకటక్రిష్ణయ్యగారు, కామయ్యగారు కొబ్బరికాయ నీళ్ళు యివ్వగా శాస్త్రిగారు త్రాగిరి. ఉపవాసదీక్ష పూర్తి అయ్యేను. కొంత సేపు ఉండి గుంటూరువారు, రంగా, భారతీదేవి వెళ్ళిపోయిరి.

1934 లో జరిగిన సెంట్రలు ఎసెంబ్లీకి రంగాగార్ని కాంగ్రెసు అభ్యర్థిగా పోటీ పెట్టారు. రంగాగారు ఆ ఎన్నికలలోనే మొట్టమొదటిసారి పార్లమెంటు సభ్యునిగా గెల్చినారు. ఆ ఎన్నికల సందర్భముగా నేను విస్తృతంగా ప్రచారం చేశాను.

**16-2-1934**

ఎలక్షను ప్రచారం సందర్భంగా నేతి చలపతిరావుగారితో మాట్లాడుతూ రంగాగారి ఉద్దేశ్యము కాంగ్రెసుకు అప్రతిష్ఠ కలుగజేయటమే. నన్ను, చంద్రమౌళిని మరీ ఎక్కువ కాంగ్రెస్‌కు అప్రతిష్ఠ కలుగజేయుటయే. కాంగ్రెసులో ఏ విధమైన ఆలోచన లేకుండా అతని యిష్టప్రకారము చేయుచున్నాడు. డబ్బులేదు. దస్కం లేదు. ఏమి చేయవలయునో తెలియకున్నది. ఈ విషయములన్నియు చలపతికి బాగుగా చెప్పి 17 న తెనాలి రమ్మని చెప్పితిని.

**17-9-1934**

సాంబమూర్తిగారు ఉదయం బండిలో బయలుదేరి తెనాలిలో దిగిరి. నేను, శరణు స్టేషనుకు వెళ్ళితిమి. మధ్యాహ్నందాకా వారితో కలిసి తిరిగితిమి. శరణు పెండ్లి శుభలేఖలు అచ్చువేయించి, భోంచేసి లైబ్రరీలో నిదురపోతిమి. కొంచెం సేపటిలో చలపతి ద్వయం, గాలీబులు వచ్చినారు. ఎలక్షన్ విషయాలు మాట్లాడితిమి. ఏమియు తేలలేదు. రంగా రాలేదు. కారణం తెలియదు. రేపల్లెలో బండి అందలేదని తెల్సినది. చంద్రమౌళికి సుస్తీగా ఉన్నది. సాయంత్రము 5½ గంటలకు

మీటింగు. ఆంజనేయులుగారు ప్రశిడెంటు. సాంబమూర్తిగారు మాట్లాడిన తరువాత, భావయ్యగారు జిల్లా సంఘములోని తగాదాలను గురించి మాట్లాడిరి. దానిమీద బాగా గల్లంతు జరిగినవి. దానికి సమాధానం నేతి చలపతిరావుగారు చెప్పిరి ఆ తరువాత శరణు రామస్వామి సమాధానం చెప్పిరి. తరువాత నేను చెప్పితిని. నేను, చలపతి రావు చంద్రమౌళితో మాట్లాడి సరిచేసితిమి. యింతలో రంగాగారు వచ్చినట్లు తెల్సినది అందరమూ వారి కొరకు వేచి ఉంటిమి. రంగావచ్చి, చంద్రమౌళి, కన్నెగంటితో మాట్లాడి మమ్ము కబురు చేయగా మేమందరము వెళ్ళి అన్ని సంగతులు వివరంగా మాట్లాడితిమి. మేమందరమూ టౌనుహాలులో పరుండి, ఉదయం బండికి (18-9-34) నేను, విజయరామడు నిడుబ్రోలులో దిగి మంతెన వారి పాలెం చేరినాము.

## 21-10-1934

రేపల్లె- గుంటూరు- బాపట్ల తాలూకాలలో కాంగ్రెసు అభ్యర్థికి ప్రచారము. గుంటూరు నెల్లూరు జిల్లాలలో ప్రచారము. 19-11-1934. కాంగ్రెసు అభ్యర్థి రంగాతో బుచ్చిరెడ్డి పాలెంలోను నెల్లూరులోనూ సన్మానములు.

సేకరించినది
మంతెన వెంకట రాధాకృష్ణంరాజు
ఉపాధ్యక్షులు
శ్రీ మంతెన వెంకటరాజు సేవాసమితి.

# "కులపతి" ఆచార్య రంగా

—పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి
మాజీ మంత్రి

మహాత్మాగాంధీని "కులపతులకు కులపతి"గా పరిగణించవలసియుంటుంది గాంధీజీ భారతదేశములోనే గాక ప్రపంచ వ్యాప్తముగా "అహింసా" పద్ధతిన ద్వేష రహితముగా కార్య సాధనకు చూపిన మార్గాన్ని "గాంధీయిజం" అన్నారు. ఆ విధానాన్నొక సిద్ధాంతమన్నారు మేధావులు.

ఆ విధముగానే ఆచార్య రంగా-వచ్చీరాని చదువులతో, చాలీచాలని బ్రతుకులతో, పరిపాలకులకు, పట్టణ ప్రజలకు, మేధావులకు కట్టు బానిసలుగా బ్రతికే గ్రామీణ ప్రజానీకానికి, తమ శ్రమకు విలువ తెలియకుండా తమ వృత్తికి గౌరవము లేకుండా, తమ బ్రతుకు, బిడ్డల భవిష్యత్తు ఆలోచించకుండా, బ్రతికే రైతులకు, కూలీలకు, చేనేత పారిశ్రామికులకు, గీత పారిశ్రామికులు, కుమ్మర, కమ్మర, రజక, నాయీ బ్రాహ్మణ, తదితర చేతి వృత్తులవారి రక్షణకు, అభివృద్ధికి అవసరమైన బోధన శిక్షణలు నిచ్చి వారిలోనుండే నాయకత్వాన్ని రూపొందించే కృషి చేసిన వారు ఆచార్య రంగా ఆ వర్గాల్లో తమ ప్రయోజనాల గురించి ఆలోచించి నిర్ణయించుకొనే మనస్థితిని పెంచాలన్నదే శ్రీ రంగాగారి ఆశయం, లక్ష్యం.

"ఇనుప కండరాలు కలిగి, గుండె ధైర్యంతో, ఉన్నత లక్ష్యం కొరకు జీవితాలను అంకితం చేసే వందమంది మనుషులు నాకు లభిస్తే ఈ దేశపు రూపురేఖల్ని మార్చగలను నేను'' అన్నారు స్వామీ వివేకానంద.

అలాంటి ఆశయం ఆదర్శాలతోనే శ్రీ రంగాగారు గ్రామీణ ప్రజలకుపయోగించే విధంగా రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరంగా వృత్తిపోషణ, ఆత్మగౌరవము పెంపు, జాతి గౌరవము ఉన్నత స్థాయికి పెరిగే విధంగా కొన్ని విధానాలను సిద్ధాంతీకరించిరి. దాన్నే "రంగా యిజం" అని అనుకూలురు, ప్రతికూలురు కూడా ధృవీకరించిరి.

దేశములో గ్రామీణ ప్రజలు నూటికి డెబ్బయికి పైగా నున్నారు. కాని ఆ ప్రజానీకానికి తోడుగా నీడగా, వారి వాక్కుగా వారికోసం వారి నాయకులుగా చాల తక్కువ సంఖ్యలో వున్నారు.

గ్రామీణ ప్రజల్లో యెంతో మంచితనం వుంది. కాని బలంలేదు- బలంలేని మంచితనం చేతగాని తనం అవుతుంది.

1934 నుండి శ్రీ రంగాగారు రైతాంగ విద్యాలయములు నడిపిరి. నిడుబ్రోలులో రామానీడు విద్యాలయము కేంద్రము. ఆంధ్ర దేశమునుండియే గాక దేశములోని అనేక ప్రాంతాలనుండి నాయకులు వచ్చి ఉపన్యసించేవారు.

శ్రీకాకుళం నుంచి చిత్తూరు, కడప, కర్నూలు వరకు అన్ని జిల్లాల నుండి వందలమంది యువకులు, యువతులు శిక్షణ బొందిరి. ప్రజాసేవకు పెద్ద చదువులతోనే నిమిత్తములేదుగదా. చదువురానివారు, తెలుగు మట్టుకే వచ్చినవారు కూడా- శిక్షణ పొందినవారు నాయకులుగా పెరిగిరి.

రంగా శిష్యులు యెక్కడ ఉపన్యసించినా వారి ధోరణే వేరు. ఏ రాజకీయ పార్టీకి లేని, ప్రజల్లో చలనము కలిగించే పాటలు, పద్యాలు సేకరించి "రైతు భజనావళి" ప్రజల ముందుంచిరి. 1937 నుంచి యిప్పటివరకూ ఎం.ఎల్.ఏ., ఎం.పి. ఎలక్షన్లలో కాంగ్రెసు పక్షాన "భజనావళి" కాపీలు వేల సంఖ్యలో పంచబడుతాయి. ఆ పాటల, పద్యాల ప్రభావము గొప్పగా పనిచేసింది. "శెట్టిపల్లె" వ్రాయాలి "అట్లూరి" పాడాలనేది వాడుక మాట-రెండు దశాబ్దాలు.

"వాహిని" వార పత్రికకు 50 ఏండ్లు దాటుతుంది త్వరలో. కీ.శే. న్యాయపతి నారాయణమూర్తి, పంతితారాధ్యుల నాగేశ్వరరావుగారు మొదటి సంపాదకులు.

శ్రీ కౌసరాజు బ్రహ్మయ్యగారు నిర్వాహకులు. ఇప్పటి నిర్వాహకులు శ్రీ వెల్లంకి చంద్రపాల్ దంపతులు. ఒక సంవత్సరం సంపాదకుడుగా "వాహిని" తో నాకూ సంబంధముంది.

శ్రీ రంగాగారు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ ప్రకాశం పంతులు, శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య, బౌద్ధ వాఙ్మయ బ్రహ్మ శ్రీ బలరామ కృష్ణయ్య, శ్రీ పల్లం రాజు, శ్రీ పేట బాపయ్య, శ్రీ ముచ్చుమర్రి చిన శివారెడ్డి మొదలగు నాయకులు కార్యవర్గ సభ్యులు. శ్రీ కందుల ఓబులరెడ్డి గారు ప్రధాన కార్యదర్శి. రెడ్డిగారు ప్రధాన కార్యదర్శి దేశంలోని అన్ని రాష్ట్ర కమిటీలకు ఆదర్శముగా ఆంధ్ర రాష్ట్రములోని "నిర్మాణ" కార్యకర్తలలో విచార, ప్రచార కార్యక్రమము నేర్పాటుచేసిరి. అందులో ఒక ముఖ్యులు శ్రీ పొట్టి శ్రీరాములుగారు. శ్రీ గోగినేని లక్ష్మినారాయణగారి అధ్యక్షతన 140 మంది కార్యకర్తలు అన్ని జిల్లాల్లో ప్రజా సంబంధముల పెంపొందించిరి.

1941 నాటి సంగతి మద్రాస్‌లో సత్యమూర్తిగారిని అరెస్టు చేసి రంగా గారికి Externment Order అందే మద్రాసు వదలవలెనని ప్రభుత్వపు ఉత్తర్వులు.

ఉత్తర్వులు పాలించవలెనని మహాత్మా గాంధీగారు సూచించగా సత్యమూర్తి గారు ధిక్కరించుమనిరి. ఫలితం రంగాగారి అరెస్టు.

దానిమీద గాంధీగారు మంచి టయములో రంగా పొరపాటు పని చేస్తారన్నారు. అనాటి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంపాదకులు శ్రీ పోతన్ జోసఫ్ తీవ్ర పదజాలముతో గాంధీజీని ఎదిరించి రంగాజీని సమర్థించిరి. దేశములో అనేక పత్రికలు రంగాను సమర్థించినవి. గాంధీజీ చల్లగా తప్పుకున్నారు. "రంగా నాకు సన్నిహితుడు. ఆయన మహా గొప్ప ఆర్థిక శాస్త్రవేత్త. ఆయన్ను విమర్శించేందుకు నాకు హక్కు వున్నదన్నారు."

రంగాగారు పార్టీలు మారుతారని ఒక విమర్శ వుండేది.

ప్రజా సమస్యల నిర్ణయాల్లో, ఆచరణలో న్యాయమనుకున్నపుడు మారుటలో తప్పేముంది. కాంగ్రెసు చరిత్రలో 1905 నుంచి ఎంతో మంది మహా నాయకులు మారినారు. కొంత మంది రాజకీయాలే వదిలినారు. నేతాజీ సుభాష్ చంద్ర బోసు ఫార్వర్డు బ్లాకు పెట్టిరి. శ్రీ రాజగోపాలాచార్లు, రంగాజీ, మినూ మసానీ స్వతంత్ర పార్టీ పెట్టిరి. అయినా దేశము, ప్రజలు సమస్యల్లో చిక్కుకున్నప్పుడు కాంగ్రెసులో చేరిరి.

ఏమయినా సరే ఒక పార్టీనే ఆశ్రయించుకుంటే ఎప్పటికయినా పదవి దొరకుతుందేమోననే వాళ్ళు, తాముగా ఒక పార్టీని పెట్టి నిగ్రహించలేని వాళ్ళు మనసు ఒప్పక పోయినా పార్టీ నుండి మారరు.

రాజ్యాంగానికి 17 వ అమెండుమెంట్లు తెచ్చినపుడూ, భూసంస్కరణలు తెచ్చి ప్రత్యేకించి రైతుల ఆస్తులనే వివక్షతా రహితంగా తగ్గించాలన్నపుడు ఆత్మ గౌరవము కలిగి రైతాంగ క్షేమము కోరిన వారు ఎంతో మానసిక వ్యధకు పాల్పైనారు. కోట్ల రూపాయల ఆస్తులు, పెద్దజీతాలు తీసుకునే ఉద్యోగులు, ఏటా లక్షలు ఆదాయము వచ్చే పరిశ్రమదారులు, వ్యాపారస్తులు ఈ చట్టాలతో ఇబ్బంది పడలేదు. కొందరు పార్టీ వదలినారు. ఆక్షేపించలేనివాళ్ళు బలహీనులు, అవకాశవాదులు.

**Consistency is the characteristic of the Donkey** అన్నారు. ఒక నిర్దిత ధ్యేయమున్నది కాబట్టే గ్రామీణ ప్రజల్లో చలనము కలుగ జేసి తమ హక్కుల రక్షణకు కార్యోన్ముఖులను చేయాలను సంకల్పం బలముతోనే రంగాజీ పార్టీని వదులుట జరిగింది.

దక్షిణాదిన శ్రీ ప్రకాశం పంతులు, శ్రీ రాజాజీ ఎదురులేని నాయకులు. అలాంటివారి ఆప్యాయతతో, సహకారముతో, ఇటు కాంగ్రెసులో, అటు స్వతంత్ర పార్టీలో శ్రీ రంగాగారు చరిత్రాత్మకమైన ఖ్యాతి సంపాదించిరి.

శ్రీ రంగాగారికి రాయలసీమ పుట్టినిల్లుగా నడిచింది రెండు దశాబ్దాలు. మిత్రులు కీ॥ శే॥ శ్రీ శంభురెడ్డిగారు అనేవారు "రాయలసీమలో" రాయిని పలకరించినా "రంగా" అంటుందని.

50 సంవత్సరాలు పైబడింది శ్రీ రంగాగారి పార్లమెంటు సభ్యత్వము. దేశ సంబంధమైన, ప్రజాసంబంధమైన ప్రతి సమస్యపైన శ్రీ రంగాజీ వ్యాఖ్య కన్పడుతుంది. ఇప్పుడో, ఎప్పుడో పార్లమెంటులో రంగాగారి ఉపన్యాసాల ముఖ్య భాగాలు సేకరించి ప్రకటించే కాలము వస్తుంది.

బ్రిటిషు పార్లమెంటు పేరు చర్చకు వస్తే (Edmund Burke) ఎడ్మండు బర్కు పేరు వస్తుంది బర్కు "ఉపన్యాసాలు పగలు చదివి రాత్రిళ్ళు కలలు కనమ"న్నారు. ఆయన పదవిని ఆశించలేదు. పదవి రాలేదు.

గ్రామీణ స్త్రీలల్లో భారతీదేవిగారి పేరు తెలియని వారు లేరు ఆ రోజుల్లో. పల్లె సీమల్లో ఎంతోమంది బిడ్డలకు "భారతి" అని పేరు పెట్టుకున్నారు.

యువకులుగా, కార్యకర్తలుగా ఆ దంపతుల దగ్గరైన వారందరికీ ఆమె తల్లి- మాకు తల్లిగా కన్పడిరి.

రంగాగారు అదృష్టవంతులు - భారతీదేవిగారి లాంటి భార్య, శ్రీ వెంకటప్పయ్య, లక్ష్మీనారాయణగారి లాంటి సోదరులు వారికి కలుగుట.

# నిత్యోత్సాహి రంగా

—డా॥ సి. నారాయణ రెడ్డి
వైస్ ఛాన్సలర్
ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

ఆచార్య రంగా నిడుబ్రోలును జాతీయ పటాని కెక్కించిన కర్షకోద్యమ నాయకుడు. రైతుజన బాంధవుడు. వయసును జయించిన నిత్యచైతన్యధనుడు. 85 ఏళ్లు నిండినా 58 ఏళ్ళవాళ్ళకు—అంతకాస్తే 18 ఏళ్ల ప్రాయం వారికే వీరతా స్ఫూర్తి కలిగించే సముత్సాహశీలం ఆయనది.

రంగా గారి వంటి నిరంతర ప్రజాసేవాజీవనులు వందమంది వుంటే మన రాష్ట్రం, దేశం మరెంత బాగుపడుతాయని నా విశ్వాసం.

మీ
(సం/-) సి. నారాయణ రెడ్డి

# ప్రజాసంస్థల నిర్మాణ కౌశలం- ఆచార్య రంగా గారిదే!

—శ్రీమతి సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి

మహాత్మాగాంధి రాజకీయ నాయకత్వంలో జాతీయోద్యమం ఊపునందుకొనిన రోజులవి. 1930 ఉప్పు సత్యాగ్రహం, 1932 శాసనోల్లంఘన ఉద్యమంతో దేశప్రజలలో ఉత్సాహం పెల్లుబికినది. దేశభక్తులు బ్రిటిషు ప్రభుత్వ దమన నీతిని ఎదిరించి పోరాడిరి. ఆనాటి వారి త్యాగములు వర్ణనాతీతం. లాఠీలు, జైళ్ళు, ఉరి కంబాలు ప్రజల స్వాతంత్ర్య పిపాసను మరింత యినుమడింప జేసినవి.

జాతీయ నాయకుడైన శ్రీ ఆచార్య రంగా ఉద్యమ విరామ కాలంలో దేశభక్తులైన యువతీ-యువకుల శిక్షణకై రాజకీయ పాఠశాలను 1933 లో ప్రారంభించిరి. వివిధ దేశాల స్వాతంత్ర్య పోరాటములను గురించి, ప్రజాస్వామిక, ఆర్థిక, సాంఘిక అనేక విషయముల గురించి శిక్షణ గరపిరి. భారతదేశంలోని అనేకమంది అగ్రనాయకులు విచ్చేసి వివిధ సమస్యల మీద ఉపన్యాసములు చేసెడివారు. ఈ విధంగా కొన్ని సంవత్సరములు రైతాంగ పాఠశాలను నిడుబ్రోలులో నిర్వహించి వేలాదిమంది యువకులను తయారు చేసిరి. ఆ విద్యాలయంలో శిక్షణ పొందిన యువతీ యువకులు ఈ రోజున కమ్యూనిస్టు పార్టీ మొదలుకొని యితర రాజకీయ పార్టీ నాయకుల్లో మనకు ఎంతోమంది కన్పించెదరు. ఆనాడు రంగా గారు కాంగ్రెసులో తీవ్రవాదిగా వుండుటవలన యువకులకు ప్రోత్సాహకరంగా వుండెడిది. రంగాగారి ఉద్యమాలకు ఆ రోజులలో రాయలసీమ పట్టుకొమ్మ.

# కాంగ్రెస్ అధ్యక్షులుగా రంగా

రంగాగారు 1946 లో రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులుగా ఎన్నికైరి. కాంగ్రెసును పుష్టివంత మొనర్చుటకు కొన్ని శాఖలను వారి అధ్యక్ష కాలంలో ఏర్పాటు చేసిరి. చేనేత కాంగ్రెసు, రైతు కాంగ్రెసు, మహిళా కాంగ్రెసు, కాంగ్రెసు సేవాదళం మొదలైనవి వాటిలో కొన్ని. ఆనాడు కొంతమంది వ్యక్తులు, కొన్ని పత్రికలు పై ఉపాంగములను హేళన చేస్తూ రంగాగారిని దశకంఠుడుగా చిత్రించిరి. అయితే ఈ రోజు ఆయనను విమర్శించిన పార్టీలే ఆ కార్యక్రమమును శిరసావహించినవి. పనిని విభాగించుటవలన కార్యక్రమం చక్కగా నిర్వహించుటకు వీలుండును. ఆలస్యంగానైనా అంగీకరించుట హర్షదాయకమే. రాజకీయ పాఠశాలలు విజ్ఞానదాయకాలు కాగా, ఉపశాఖలు కార్యక్రమము సుళువు చేసినవి. ఈనాటి చేనేత పరిశ్రమ అభివృద్ధికి శ్రీ ఆచార్య రంగా మూలపురుషుడని చెప్పవచ్చును.

# రైతు ఉద్యమనేత

స్వాతంత్ర్య ఉద్యమంలో వివిధ సమస్యలు మిళితమై ఉన్నను రంగాగారి దృష్టి రైతు ఉద్యమం వైపుకు మొగ్గు చూపుచుండెడిది. 'జాతికి వెన్నెముక రైతు' అనునది ఆనాడు, ఈనాడు రంగాగారు విస్మరించలేరు. ఫైజ్‌పూరు కాంగ్రెసు మహాసభకు యించుమించు దీటుగా జరిగినది ఆనాటి అఖిల భారత రైతు మహాసభ. దానికి అగ్రనాయకులు స్వామి సహజానంద, ఇందులాలు యాజ్ఞిక్, శ్రీ ఆచార్య రంగా. ఈ రైతులలోని చైతన్యం గాంధీగారిని ఎంతయో ఆకర్షించినది. ఆనాడు రైతులలో ఉత్సాహం కట్టలు తెంచుకొనినది. రైతు సమస్యల గురించిన సాహిత్యం వ్రాయుటకు యువకవులకు రంగాగారు మిక్కిలి ప్రోత్సాహమిచ్చిరి. 'ఆగునా జీవాలు, సాగునా లోకాలు రాజుగా మనమెంచి రైతు చూడక పోతే దేశమే యిల నిల్చునా' అను పాటలు, 'రైతు పండించిన రాజనాలే కాక బంగారమెవ్వండు మ్రింగుదయ్యా'' అను పద్యాలు మొదలైన ఎంతో రైతు

సాహిత్యం సృష్టించబడినది. పల్లెపెద్దలను చూచి ఉప్పొంగి పోయెడివారు రంగా. ఆ వెనువెంటనే పల్లెల దుస్థితికి 'దారి డొంకలులేని ఊళ్ళున్నా మన పల్లెటూళ్ళు' అని బాధపడిపోయెడి వారు. యింత చైతన్యం వచ్చినా యీనాటికీ కట్టుదిట్టమైన సంస్థగా రైతు ఉద్యమం రూపు దిద్దుకొనకపోవటం బాధాకరం.

## మహిళలు-రంగా

భారతీయ సంస్కృతిని పుణికి పుచ్చుకొనిన మహనీయ వ్యక్తి శ్రీ రంగా. పల్లెటూరి యువతియైన శ్రీమతి భారతీదేవిని, ఆ రోజులలో సమాజానికి ఎదురు నిలచి విదేశములకు తీసుకొనిపోయి, విద్యా విజ్ఞానములలో ప్రోత్సాహమిచ్చిన భర్త శ్రీ రంగా. సునిశిత మతియైన భారతీ దేవిగారు ఆయన ఆశయాలను అందుకొని తనను తాను తీర్చి దిద్దుకొని రాణించినది. రంగా గారికి శ్రీమతి భారతీ దేవి సాహచర్యం లభించటం బంగారమునకు తావి అబ్బుటయే. అంతేకాదు కొన్ని కొన్ని క్లిష్టపరిస్థితులలో శ్రీమతి భారతీదేవి సలహాలు రంగాగారికి ఎంతయో ఉపకరించెడివి. స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్ర రాష్ట్ర మంతయు ప్రచారం చేసి భారతీదేవి శ్రీ రంగాగారికి కుడి భుజంగా నిలచినది. మా చేబ్రోలు రంగాగారి నిడుబ్రోలుకు 8 మైళ్ళలో వున్నది. జాతీయోద్యమంలో అగ్రగామిగా నిలచిన గ్రామం చేబ్రోలు. దాదాపు యాభై మంది పైగా స్త్రీ-పురుషులు జైళ్ళకెళ్లిన గ్రామం. జాతీయోద్యమ ప్రభావంతోపాటు రంగా దంపతుల ప్రభావం కూడా ఆ గ్రామంపై ఎక్కువగా ఉన్నదనుటలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. భారతీ దేవి అధ్యక్షురాలుగా, పూజనీయురాలు శ్రీమతి గోళ్ళమూడి రత్నమ్మ ఉపాధ్య క్షులుగా, నేను కార్యదర్శిగా 1945 అక్టోబరులో ఆంధ్ర రాష్ట్ర స్త్రీలకు ఒక ఒక మాసం దినాలు రాజకీయ పాఠశాల నిర్వహించితిమి. శ్రీమతి రాజ్యం సిన్హా మద్రాసులో స్త్రీలకు మరొక రాజకీయ శిక్షణా శిబిరం నిర్వహింటరి. రాజకీయ శిక్షణా శిబిరాలకు రంగాగారు వేసిన పునాదులే ఈనాటికి. శిబిర ప్రారంభకులు శ్రీ కళా వెంకట్రావుగారు. శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ, యస్. కే. పాటిల్

మొదలైన అనేక మంది ప్రముఖుల ఉపన్యాసముల ఏర్పాటుకు రంగాగారు మాకు తోడ్పడిరి. అంతేకాదు కొన్ని దినాలు శిబిరంలో వుండి ఆచార్యత్వ బాధ్యత రంగాగారు, కీర్తిశేషులు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు గారు నిర్వహించి మాకు ఊపునిచ్చిరి. రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులైన ఆంధ్ర కేసరి రెండు పర్యాయములు విచ్చేయుటయేగాక ఆర్థిక సహాయ మందించిరి.

అగ్ర నాయకులలో ఒకరైన శ్రీ రంగాగారిని, శ్రీయుత వెంగళరావుగారు అధ్యక్షులుగా నున్న ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు సంస్థ సన్మానించుట మిక్కిలి సంతోషదాయకం. నీతి కొరవడి, అవినీతి అగ్రస్థాన మలంకరించుచున్న ఈనాటి వాతావరణంలో రంగాగారి చరిత్ర యువతీ యువకులకు ఆదర్శప్రాయం. రాష్ట్ర కాంగ్రెసు సంస్థకు శ్రీ రంగా అధ్యక్షులుగా వున్న సమయంలో వివిధ వృత్తులలో గల యువతీ యువకులకు ప్రోత్సాహంతోపాటు క్రమశిక్షణ, ఆర్థిక విధానం సహితం అలవరచిరి. ప్రతి కార్యకర్త పైసపైసకు లెక్క చెప్పవలసినదే. ఈ విషయంలో జాతిపిత మహాత్మాగాంధిని తలపుకు తెచ్చిరి. వారి హయాంలో రాష్ట్ర కాంగ్రెసుకు లక్షల నిధి సమకూర్చిరి. జాగ్రతగా కాంగ్రెసు ప్రచారము నకు ఉపయోగించిరి. ఈనాడు కార్యకర్తలలో ఆ జాగ్రత హరించుకు పోయిన దనుట సాహసం కాదనుకొంటా. అర్ధ శతాబ్దం గాంధీజీ జాతికి సత్యాహింసలతో పాటు నీతి నియమాలను ప్రబోధించిరి. అవి ఈనాడు మృగ్యం. పల్లె ప్రజలతో తాదాత్మ్యం చెందిన వ్యక్తి శ్రీ రంగా. జాతి అభివృద్ధికి పల్లెలు ఆయువు పట్టు. ఆ ఒరవడిని అలవర్చుకొనిన శ్రీరంగా జన్మదినం కార్యర్తలకు ప్రేరణ కాగలదని విశ్వసించుదాం. 85 సంవత్సరాలు నిండి 86వ పడిలో ప్రవేశించుచున్న శ్రీ ఆచార్య రంగా శతాధిక వత్సరాలు సంపూర్ణ జీవితం గడిపి భారత ప్రజలకు యినుమిక్కిలి సేవలందించవలెనని నా హృదయ పూర్వక ఆకాంక్ష. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు రంగాగారిని సన్మానించుట తనను తాను గౌరవించుకొనుటయే.

కాంగ్రెసు శతజయంతి ఉత్సవాలు జరుపుకొనుచున్న ఈ తరుణంలో వెనుకకు తిరిగి తన చరిత్రను ఒకపరి సింహావలోకనం చేసుకొనుట ఎంతయు సముచితం. ఈ సందర్భంగా రాజకీయ చరిత్రయేకాక పవిత్రమైన వ్యక్తిగత చరిత్ర కలిగిన శ్రీ రంగా గారి సన్మానం ఆంధ్ర ప్రజలకు ఉత్తేజం కాగలదని ఆశించుదాం.

# నీరాజనము

రచన : యస్. రవికుమార్
లెక్చరర్, భూవిజ్ఞానశాఖ
హిందూ కళాశాల,
గుంటూరు.

రంగాజీ!
శుభమగు గాక మీకు!
మీ ఎనుబది ఆరవ పుట్టినదిన పండుగ
యావజ్జనావళికి నిజమైన పండుగ

రాజకీయ రంగాన 'రంగాజీ'గా మీ ప్రవేశం
రాజీలేని పోరాట జీవనానికి ఉషోదయం
రైతుకూలి ఉద్యమ పోరాటమే మీ నిరంతర ఆరాటం
నీతి నిజాయతీల మేల్కలయికే మీ జీవనము

అర్థిక శాస్త్రాన మీ పాండిత్య విశేషమ్
'ఆచార్య' పదవికి నిజమైన అలంకారము

ఆర్థిక రాజకీయ పరిశోధక విద్యార్థులకు మీరో సబ్జెక్టు
మీ పాండితీ విశేష ఫలాస్వాదనమే వారి ఆబ్జెక్టు

నిజమైన జాతీయవాదులు మీరు
ఏ 'ఇజమ్' మీకు ఉన్నా లేకున్నా
'మానవిజమే' మీకు సైదోడు

సహస్ర చంద్రుల గాంచిన మీరు
శత సహస్ర భాను తేజంతో లక్షచంద్రుల ఇకపై చూడగలరు

ఇదిగో! రంగాజీ!! యిటు చూడండి!!!
మీవెనుక లక్షల జనావళి, రైతుకూలీ సోదరావళి
ఆశగా ఆర్తితో నిలుచున్నాయ్!

మీకు జయజయ నాదాలు పలుకుతున్నాయ్!
అండగా, నిండుగా, నిండుగుండెతో
మీవెనుకే పరిగెడుతున్నాయ్!

విజయం తథ్యం మీకు! శుభం నిత్యం మీకు!!
అందుకోండి మా యీ అక్షర నీరాజనం
జయము! జయము!! జయమగుగాక మీకు!!!

# 1946లో
# ఆచార్య రంగా–తెలంగాణా

–యం. యస్. రాజలింగం
(మాజీ మంత్రి)

ఆచార్య రంగా రైతు బాంధవుడిగానే దేశం చాలావరకు పేరిగింది. 1946లో వారు సాధించిన ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షపదవి వారి జీవనంలో యొక మలుపు రాయి అని చెప్పవచ్చు. కమ్యూనిష్టు ప్రభావితమైన రైతు సమస్యలను కాంగ్రెసు జీర్ణించుకోవడమో లేక సమన్వయ పరచు కోవడమో చేయవలసిన సమయమది. రైతు ప్రజా శ్రామికులంతా కమ్యూనిస్టు విప్లవ రాజకీయాల వర్గ సంఘర్షణకు తద్వారా ఆశించిన విప్లవంవైపు మొగ్గకుండా ఆపగల్గిన వ్యక్తిత్వము, నాయకత్వం, ఆచార్య రంగా గారికి, ప్రకాశంగారికి మాత్రమే దక్కినదని చెప్ప వచ్చు. మానవ బలహీనతకు, అతీతంగావుండి యీ విషయాన్ని ఆచార్య రంగా గారు వర్గసమన్వయ పద్ధతిపై సాధించారని చెప్పుట అతిశయోక్తికాదు. ఇది నాకు వారితో ఏర్పడిన ప్రథమ పరిచయంలోను, సమస్యలను పరిష్కరించడంలోను నేపొందిన అనుభూతి, కలిగిన విశ్వాసము.

1946 నాటికి పట్టాభి, ఆంధ్రకేసరి వర్గాలు తీవ్రంగా పనిచేయసాగాయి. ఈ సందర్భంలో ఆచార్య రంగాగారి పాత్రకూడా కొంత ప్రాముఖ్యత వహించింది. అయితే తెలంగాణా ప్రాంతీయులకు పట్టాభి, ఆంధ్రకేసరి, ఆచార్య రంగాగారల పరిచయాన్ని కలిగించడం మాకు చాల సులభమయ్యేది. వెనుకబడి వున్న ప్రాంతం

కాబట్టి గాంధీ టోపి పెట్టుకున్నవారు ఆచార్య రంగా అని పరిచయం చేయడంతో తెలంగాణా రైతాంగం వారిని "రైతు గాంధీ" అనే భావించడం కూడా నేను ఎరుగుదును. ఈ రెండు మాటలలోనే ఆర్థిక విప్లవము, భావ సమన్వయత, సమస్యా పరిష్కారము యిమిడిపోయాయి. తెలంగాణా జమీందారీ పోరాటంలో అయితేనేమి, కాశీ పట్నం పోరాటంలో అయితేనేమి యీ మనోవైఖరి రైతు ఉద్యమాన్ని బలపరిచిందని చెప్పవచ్చు. తెలంగాణా పోరాటమప్పుడు వాటి పరిష్కారానికై వారు అధ్యక్షులుగను, అయ్యదేవర కాళేశ్వరరావు కార్య దర్శకత్వంలో యొక ఉపసంఘాన్ని వేసి తెలంగాణా పరిస్థితులు అవగాహన చేసుకొని అఖిల భారత సంస్థాన ప్రజా మండలి, అఖిల భారత కాంగ్రెసు కను విప్పునట్లు పంపిన రిపోర్టు యీ విషయాన్ని స్పష్టం చేసింది. ప్రజలను తప్పు దారిని పట్టించడం మాత్రమే జరిగిందని, ప్రజలకు కమ్యూనిస్టు ఉద్యమం పట్ల మొగ్గు ఫ్యూడల్ దౌర్జన్యాలు లేకపోతే వుండేవి కాదని వారు స్పష్టం చేసారు. ఈ అభిప్రాయం ఆనాటి స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షులైన స్వామీజీ కమ్యూనిస్టు అనే భ్రమను కొంత తొలగించింది. అలాగే పోలీసు యాక్షను తరువాయి గ్రామ గ్రామాలే కమ్యూనిస్టులుగా మారాయి అనే పొరబడే మిలిటరీ వారికి చారిత్రకంగా అలా కాదని నచ్చ చెప్పడానికి తోడ్పడింది. వ్యక్తిగత ద్వేషాలను సాధించుటకై సామాన్య జనాన్ని మిలిటరీ వారికి కమ్యూనిస్టులని పట్టించి పలుబాధలకు గురిచేసిన సందర్భాలలో యిబ్బందులలో వున్న వారికి ఆచార్య రంగాగారి యీ అభి ప్రాయాన్ని తెలిపి న్యాయాన్ని చేకూర్చడం జరిగింది.

ఇదే సంవత్సరం తెలంగాణాలో నేటి ఆంధ్రప్రదేశ్‌కు బీజాలు వేయడం ఆచార్య రంగాగారివల్ల జరిగిందనడంలో అతిశయోక్తి లేదు. కాంగ్రెసు భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఎన్నడో అంకితమయింది. అలా అని హైద్రాబాదులోని తెలంగాణా, మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాలు ఆయా అఖిల భారత ప్రాంతీయ కాంగ్రెసుల్లో సభ్యత్వం పొంది ప్రతినిధులని పంపే అవకాశం వుండింది కాదు. ముఖ్యంగా డా॥ పట్టాభిగారు అఖిల భారత సంస్థాన ప్రజామండలి యీ విధానానికి అంత సుముఖంగా లేకుండిరి. డా॥ పట్టాభిగారు సర్దార్ పటేల్ అంతరంగికుడు

అనే ప్రతీతి కూడా వుండింది. ఆ కారణంగా కూడా భాషా ప్రయుక్త ప్రాంతీయ ప్రాతిపదికపై ఏ ప్రాంతీయ ప్రజలు ఆయా భాషా ప్రాంతీయ రాష్ట్ర కాంగ్రెసులో వుండడానికి అవకాశం లేకపోయింది. సాహసించడం కూడా జరుగలేదు. ఈ పరిస్థితులలో పెద్దలను ఒక విధంగా గౌరవంగా కాదని నిజాం రాష్ట్ర తెలంగాణా ఆంధ్ర మహాసభ అంతర్భాగమైన ఆంధ్ర జాతీయ పక్షం తీర్మానంపై ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సభ్యత్వం తెలంగాణాలో చేర్పించడానికి ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు, ఆచార్య రంగాగారి అధ్యక్షతలో అనుమతి యిచ్చింది. నేను, డా॥ ఉపేంద్రరావు, ఎల్లాప్రగడ కృష్ణమూర్తి ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసుకు తెలంగాణా ప్రాంతం నుంచి ప్రతినిధులుగా ఎన్నుకోబడ్డాము. ఈ విధంగా ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసులో తెలంగాణా వాసులను కాంగ్రెసు సభ్యత్వంపై ప్రతినిధులుగా స్వీకరించిన కీర్తి వీరి అధ్యక్ష పదవికి దక్కింది. వీరి యీ దూరదృష్టే ఆంధ్ర రాష్ట్రమును, విశాలాంధ్రను రాజకీయంగా ఆంధ్రప్రదేశ్‌ను, అవతరించుటలో తోడ్పడింది. వీటన్నిటికి 1946 లో ఆచార్య రంగా గారు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు ద్వారా నాంది ప్రస్తావన చేసారని చారిత్రకంగా గుర్తించడం అవసరం. వీరికి యీ విధంగా తెలంగాణా చాలా ఋణపడివుంది.

# ప్రపంచ రైతాంగనేత ఆచార్య రంగా

—శ్రీ బి. శరబయ్య

స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి అతిరథ మహారథులలో ప్రస్తుతం జీవించి వున్న బహు కొద్దిమందిలో 'ఆచార్య రంగా' ఒకరు. ఆయన బహుముఖ ప్రతిభా శాలి. భారతదేశంలో రైతు ఉద్యమ పితామహుడు. చేనేత కార్మికోద్యమ జనకుడు. వ్యవసాయ కార్మికోద్యమ నిర్మాత. అసాధారణుడయిన ఆందోళనకారుడు. ప్రచండప్రచారకుడు. ఆచార్యుడు. జాతీయవాది. అంతర్జాతీయవాది. ప్రముఖు డయిన పార్లమెంటేరియన్. వక్త. ఆర్థిక శాస్త్రవేత్త. సిద్ధాంతకర్త.

"రైతు దేశానికి వెన్నెముక" అనే సూక్తి యీనాడూ ప్రతి రాజకీయవాదీ వల్లిస్తున్నదే. నేడు, ప్రతివాడూ రైతులపై జాలి నటించి మొసలికన్నీరు కార్చే వాడే. కాని రైతుల్ని గురించి మిగిలిన నాయకులెవ్వరూ పట్టించుకోని రోజుల్లో, భారత రైతాంగం తరఫున, ఆమాటకొస్తే ప్రపంచ రైతాంగం తరఫుననే పకాల్తా పుచ్చుకొని, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నుండి "కర్షకవాణి"ని వినిపించిన రైతురాజు రంగా.... దుర్భర దారిద్ర్యంలో క్రుంగిపోతూ, జమీందార్ల పీడనకు గురిఅవుతూ, దారీ, తెన్నూ గానక క్రుంగిపోతున్న హాలికులను మేలు కొలిపి వారిని, వెలుగుబాటలో పయనింపజేసిన నవయుగ వైతాళికుడాయన. ఆ 'మహామనీషి'ని గురించి ఒక వ్యాసంలో వివరంగా చర్చించటం సాధ్యంకాని పని.

ఆయన 1923 లో అంటే యిప్పటికి అరవైరెండు సంవత్సరాలక్రితం గుంటూరుజిల్లా రైతు సంఘాన్ని స్థాపించారు. ఆయన అప్పటికింకా విద్యార్థి దశ

లోనే ఉన్నారు. ఇంగ్లండులో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తూ, వేసవి శెలవుల్లో స్వదేశానికి వచ్చి, రైతుసంఘాన్ని స్థాపించి ప్రథమ గుంటూరు జిల్లా రైతు మహాసభను అప్పెకట్ల గ్రామంలో జరిపారు.

1929 లో ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘాన్ని స్థాపించారు. 1935 లో స్వామి సహజానంద, యిందూలాల్ యాగ్నిక్ గార్లతో కలిసి అఖిల భారత రైతు సంఘాన్ని స్థాపించారు. మన దేశంలో రైతాంగానికి అదే తొలి రాజకీయ వేదిక. 1946 లో లండన్‌లో ''అంతర్జాతీయ రైతు సంఘా''న్ని స్థాపించారు. యీ సంఘాల స్థాపన విషయంలో ఆయన కాంగ్రెస్ హైకమాండ్ నుండి తీవ్ర మయిన ప్రతిఘటనను యెదుర్కోవలసి వచ్చింది.

ఉక్కుమనిషి సర్దార్ పటేల్ అనేకసార్లు క్రమశిక్షణ అనే ఖడ్గాన్ని ఝళిపించి 'రంగాజీని' బెదిరించాడు కూడ. ఆ రోజుల్లో సర్దార్ పటేల్‌తో ఢీకొనుట మంటే సామాన్యమయిన విషయం కాదు.... కాని తను నమ్మిన ఆశయాల సాధనకోసం అచంచలమయిన ఆత్మ విశ్వాసంతో సాగిపోతూ, యేకాకిగా నయినా పోరాటం సాగించటానికి వెనుకంజ వేయని వజ్ర సంకల్పుడు, మేరు నగధీరుడు రంగాజీ. సర్దార్ పటేల్ కూడ కర్షక పక్షపాతియే.... అయితే రైతులకోసం ప్రత్యేకంగా సంఘాలు పెట్టనవసరం లేదని, జాతీయ కాంగ్రెస్ ద్వారానే రైతుల సంక్షేమం కోసం కృషి చేయవచ్చని పటేల్ నమ్మకం. కాని రంగాజీ దృక్పథం వేరు .... జాతీయ కాంగ్రెస్ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతోంది. అది రాజకీయ మయిన పోరాటం .... రైతుల హక్కులకోసం సాగే పోరాటాలు ఆర్థిక పర మయినవి. అందువలన వారికోసం ప్రత్యేకంగా సంఘం స్థాపించాలనేది ఆయన అభిమతం .... కేవలం రైతులకోసమే కాదు. వేర్వేరు వృత్తుల వారిని సంఘటిత పరిచి వారిని పోరాటానికి సమాయత్తం చేయాలంటే వారికోసం ప్రత్యేకంగా "వర్గ సంఘాలు'' స్థాపించాలనేది ఆయన ఆశయం. అందు కనుగుణంగానే 1935 లో వ్యవసాయ కూలీ సంఘాన్ని, 1940 లో అఖిల భారత చేనేత కార్మిక సంఘాన్ని స్థాపించేరు. యింకా చేతి వృత్తుల వారికోసం, కొండ జాతులవారి

కోసం యెన్నో సంఘాలు స్థాపించారు .... ఆనాడు వర్గ సంఘాలు స్థాపించుట మనేది యెవ్వరికీ కొరుకుడు పడని విషయం.... అందరూ ఆయనపై దుమ్మెత్తి పోశారు.... "దశకంఠుడు రంగా" అంటూ కార్టూన్ల ద్వారా వెక్కిరించారు. యీనాడు అన్ని రాజకీయ పార్టీలూ, కర్షక, కార్మిక, విద్యార్థి, యువజన.... సంఘాల్ని నెలకొల్పుకొంటున్నాయి. అంటే అర్ధ శతాబ్ది క్రితం రంగాజీ నడిచిన బాటలో అన్ని రాజకీయ పార్టీలూ పయనిస్తున్నాయన్నమాట. దీన్ని బట్టి ఆయన దూరదృష్టి యెంత గొప్పదో మనకు విశదమవుతుంది.

ప్రపంచ చరిత్రలో యే కాలంలో నయినా రంగాజీ నడిపినన్ని ప్రజా ఉద్యమాలు నడిపినవారు చాలా అరుదుగా కనిపిస్తారు. ఉప్పు సత్యాగ్రహం నుండి క్విట్ యిండియా ఉద్యమం వరకూ, స్వాతంత్ర్యోద్యమంలోని ప్రతి ఘట్టంలోనూ ఆయన ప్రముఖ పాత్ర వహించటమే కాకుండా, తను స్వయంగా సృష్టించిన యెన్నో రైతు పోరాటాలకు నాయకత్వం వహించారు.

బ్రిటిష్ ప్రభుత్వం రీ-సెటిల్మెంట్ పేరుతో 1931 లో పన్నులు అధికంగా విధించింది. అందుకు వ్యతిరేకంగా రంగాజీ ఉద్యమాన్ని నడిపారు. 1931 నవంబరు 1 వ తేదీ రీ-సెటిల్మెంట్ వ్యతిరేక దినంగా ప్రకటించబడింది. ఆంధ్ర రైతాంగం 'ఆచార్య రంగా' నాయకత్వాన ప్రభంజనంలా విరుచుకుపడింది. ఆ ధాటికి తట్టుకోలేక బ్రిటిష్ ప్రభుత్వం తల వంచింది. హెచ్చించిన పన్నులు రద్దు చేయబడ్డాయి.... 1931 లోనే జమీందార్లకు వ్యతిరేకంగా'రంగాజీ' పోరాటాన్ని ప్రారంభించారు.... జమీందార్లంటే ఆ రోజుల్లో రైతులపాలిటి యమదూతల్లాంటి వారు. రైతులపై వారి ఆగడాలకూ, దౌర్జన్యాలకూ అంతు వుండేది కాదు.... వెంకటగిరిలో 1931 లో రంగాజీచే ప్రారంభించబడిన జమీందారీ వ్యతిరేకోద్యమం, ఆంధ్రావని అంతటా విస్తరించి, అటు పిమ్మట యావద్భారతదేశానికి ప్రాకింది. "జమీందారీలు రద్దు కావాలి" అని ఆయన 'వెంకటగిరి'లో వేసిన పొలికేక యావద్భారతదేశంలో ప్రతిధ్వనించింది. జమీందార్లు దిగివచ్చి రైతులతో రాజీపడక తప్పలేదు. ఆ విధంగా తొలిసారిగా "జమీందారీలు రద్దు కావాలి"

అనే నినాదాన్నిచ్చి, అటు పిమ్మట భారతదేశంలో జమీందారీ వ్యవస్థ రద్దుకు రాచబాట వేసిన మహావ్యక్తి రంగాజీ. స్వాతంత్ర్యానంతరం ఆయన నడిపిన ఉద్యమాల్లో మొదట చెప్పుకోదగినది, కంట్రోళ్ళకు వ్యతిరేకంగా నడిపినది. 1948 లో నెహ్రూజీ కంట్రోళ్ళను విధించారు. ధాన్యం దాచుకొనే రైతులను తిండిదొంగలని అన్నారు. అందుకు వ్యతిరేకంగా రంగాజీ పెనుతుఫాన్‌లా విరుచుకు పడ్డారు దేశమంతటా పర్యటించి నిరసన ప్రదర్శనలు జరిపించారు. చివరకు 'రాజాజీ' 1953 లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారాన్ని స్వీకరించినప్పుడు కంట్రోళ్ళు రద్దు చేయబడ్డాయి. కాంగ్రెస్ పార్టీకి ఆనాడు తగిన బలం లేదు. 'రాజాజీ'కి ముఖ్యమంత్రిగా నిలతొక్కుకోవటానికి "కృషికార్‌లోక్ పార్టీ" సహకారం అవసరమయ్యింది.

కంట్రోళ్ళను యెత్తివేస్తే తన సహకారాన్ని అందజేస్తామన్నారు 'రంగాజీ'. పదవుల కోసం ఆశపడకుండా, ఆశయసాధన కోసం మరో పార్టీకి సహకరించి అధికారాన్ని కట్టబెట్టటం ఈనాటి రాజకీయవేత్తలు కలలో గూడ ఊహించలేని విషయం. 1959 లో జవహర్‌లాల్ నెహ్రూ రైతుల నెత్తిన సహకార వ్యవసాయ పథకాన్ని బలవంతంగా రుద్దాలని ప్రయత్నించారు. నెహ్రూజీని ధిక్కరించి, దేశమంతటా సంచరించి, సభలు జరిపి ఉద్యమించి ఆ ప్రయత్నాన్ని నిరోధించారు "రంగాజీ".... యీ విధంగా ఎన్నో ప్రజాఉద్యమాలను నడిపారాయన.... ఆయన జీవితం ఉద్యమాలమయం....

మద్రాసులో ఆచార్యత్వ పదవికి రాజీనామా యిచ్చినా, రాజకీయ జీవితంలో ఆచార్యుడికి మల్లే వ్యవహరించారు. రాజకీయ కార్యకర్తలకు రాజకీయశాస్త్ర పరిజ్ఞానం అవసరమని గుర్తించిన భారతజాతీయ నాయకులలో ఆయన మొదటివారు. 1934 లో నిడుబ్రోలులో "భారత రైతాంగ విద్యాలయం" పేరుతో రాజకీయ పాఠశాలను స్థాపించారు. దానికి మహాత్మాగాంధీ ప్రారంభోత్సవం చేశారు. భారతదేశంలో అదే మొదటి రాజకీయ పాఠశాల.... నేటి మితవాద, అతివాద, మధ్యేవాద పార్టీల నాయకులలో అనేకులు ఆ పాఠశాలలో శిక్షణ పొందిన

వారే.... తిమ్మారెడ్డి, చెన్నారెడ్డి, కందుల ఓబులరెడ్డి, గౌతు లచ్చన్న, మోటూరి హనుమంతరావు, వల్లభరావు.... వంటి ప్రముఖులు ఆ రాజకీయ పాఠశాలలో శిక్షణ పొందిన తర్వాత వివిధ పార్టీలలో నాయకులుగా రాణించారు. ఆయన వేనవేలుగా శిష్యులను తయారు చేశారు. ఆంధ్రదేశంలోనే కాదు, భారతదేశం లోని పలు రాష్ట్రాలలో ఆయనకు శిష్యులున్నారు. 1946 లో బొంబాయిలో "పౌరసత్వ కళాశాలను" స్థాపించి దానికి ఆచార్యుడిగా వ్యవహరించారు. జనతా ప్రభుత్వంలో మంత్రిగా పనిజేసిన రవీంద్రవర్మ, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా నున్న యన్.డి. తివారీ ఆ కళాశాలలో శిక్షణ పొందిన వారే. యీ రంగంలో ఆయన కృషిని గుర్తించిన మహాత్మాగాంధి "ఆచార్య రంగా విశ్వ విద్యాలయాన్ని వదలి ప్రజావిద్యాలయాలకు ఆచార్యుడయ్యాడు" అని ప్రశం సించారు.

ఆచార్య రంగా రైతురక్షణ యాత్రల పేరుతో అనేక పాదయాత్రలు నిర్వహించారు. వాటిలో చెప్పుకోదగినది 1937 లో ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకూ సాగిన పాదయాత్ర. ఆ తర్వాత ఆయన్ని ఆదర్శంగా తీసుకొని భారత దేశంలోని అనేక ప్రాంతాల్లో పాదయాత్రలు నిర్వహించబడ్డాయి.

ఒక దశలో ఆయన ఆంధ్ర సాహితీరంగాన్ని ప్రభావితం చేశారు. కర్షకుల బాధల్ని తిలకించి, వాటిలో చైతన్యాన్ని రగిలించే పాటలు, పద్యాలు వ్రాయమని ఆయన కవులకు సందేశాన్ని అందజేశారు. ఆయన సందేశాన్ని అందుకొని, ఆయన నడిపిన ఉద్యమాలవల్ల ప్రేరేపితులయి యెంతోమంది యువకవులు పాటలు వ్రాశారు. అవన్నీ "రైతాంగ భజనావళి" పేరుతో ముద్రించబడ్డాయి. ఆచార్య రంగావల్ల ప్రభావితులయిన కవులలో అందరికన్నా ముందుగా పేర్కొనదగిన వాడు "శెట్టిపల్లి వెంకటరత్నం"

"రైతుసత్తాదెల్ప రణభేరి మ్రోగింది
కదిలిరారండోయి కర్షకులు కదనరంగమునకున్"

అంటూ "నగారా" మ్రోగించాడు.

"ఆగునా లోకాలు.... సాగునా జీవాలు
రాజుగా మనమెంచి రైతు జూడనివాడు
దేశాలు తలలెత్తునా.... దాస్యపుం పాశాలు, తావీడునా
స్వాతంత్ర్య మిలనిల్చునా"

అంటూ యెలుగెత్తి చాటాడు.

"మా పైన పొంచి
మా ప్రాణాలు హరియించె
మా కొద్దీ జమిందార్ల పొందు"

అంటూ గర్జించాడు నెల్లూరి వెంకట్రామానాయుడు. యింకాయెంతో మంది కర్షక కవులు ఆచార్య రంగాగారి ప్రభావానికిలోనయి కర్షకగేయాలు వ్రాశారు. ఆంధ్ర సాహిత్యంలో "కర్షక కవిత్వం" చోటు చేసుకోవటానికి రంగాగారి ప్రేరేపణే కారణమని చెప్పవచ్చు.

కర్షక లోకంలో చైతన్యాన్ని దీప్తివంతం చేసే కృషిని ఆయన భారత దేశం వరకే పరిమితం చెయ్యలేదు. ప్రపంచ రైతాంగాన్ని సంఘటితపరిచి వారిలో చైతన్య జ్వాలలు రగిలించాలనే ఉద్దేశ్యంతో, ఆయన 1946లో "అంతర్జాతీయ వ్యవసాయోత్పత్తి దారుల సమాఖ్య"ను స్థాపించారు. ఆ నాటినుండి యిప్పటివరకూ యెన్నో అంతర్జాతీయ కర్షక సదస్సులను నిర్వహించారు. ఖండ ఖండాంతరాలలో పర్యటించి తన సందేశాన్ని వినిపించారు. 1956లో "పారిస్"లో జరిగిన "అంతర్జాతీయ రైతుసంఘ సదస్సు"కు ఆచార్య రంగా ప్రారంభోత్సవం జరుపటం ఆంధ్రు లందరూ గర్వించదగ్గ విషయం....

"ప్రపంచ కార్మికులారా యేకంకండు" అని కారల్ మార్క్స్ నినాదమిస్తే, ఆచార్య రంగా "ప్రపంచ కర్షకులారా యేకంకండు" అనే నినాదాన్ని వినిపించారు.

రైతు సంఘాలు, రైతాంగ విద్యాలయాలు, రైతు పోరాటాలు, రైతురక్షణ యాత్రలు, రైతాంగ భజనావళి ఇవన్నీ ఆయన సృష్టి. రైతుపోరాటాన్నే స్వాతంత్ర్య పోరాటంగా, స్వాతంత్ర్య పోరాటాన్నే రైతు పోరాటంగా తీర్చిదిద్దిన ప్రతిభాశాలి రంగా. మహాత్మాగాంధీ రాకతో జాతీయోద్యమం యెన్ని మలుపులు తిరిగిందో, ఆచార్య రంగా రాకతో కర్షకోద్యమం అన్ని మలుపులు తిరిగింది....

కర్షక లోకానికి ఆయన సారథి, సచివుడు, సఖుడు, గురువు....

ఆచార్య రంగా కేవలం రైతు నాయకుడు మాత్రమే అనుకొంటే ఆయన స్థాయిని కించపరచటమే అవుతుంది. వ్యవసాయ కూలీల, చేనేత కార్మికుల, తదితర చేతివృత్తులవారి సంక్షేమం కోసం యెన్నో సంఘాలు స్థాపించారు పోరాటాలు నడిపారు. వాటిలో చెప్పుకోదగినవి, 1937 లో స్థాపించిన వ్యవసాయ కూలీల సంఘం.... 1940 లో స్థాపించిన అఖిలభారత చేనేత కార్మికుల సంఘం. గ్రామీణ భారతానికి ఆయన తిరుగులేని నాయకుడు.

మానవ నాగరకతకు దూరంగా బ్రతుకుతూ, నాగరకుల చేత క్రూరంగా దోపిడీ చేయబడుతున్న "ఆదిమవాసుల" పరిస్థితులను మెరుగు పరచుటకై ఆయన యెంతో కృషి చేశారు. 1930 లోనే "నీలగిరి కొండజాతులు-వారి ఆర్థిక పరిస్థితులు" అను పేరుతో ఒక గ్రంథాన్ని యెంతో పరిశ్రమించి, పరిశోధించి వ్రాశారు.

"అఖిల భారత కొండ జాతుల సంఘం" అను పేరుతో ఒక సంఘాన్ని స్థాపించారు. మన జాతీయ నాయకులలో "ఆదిమజాతుల" స్థితిగతులను గురించి పరిశోధించిందీ, వాటి స్థితిగతులను మెరుగు పరచటానికి కృషి చేసిందీ ఆయన ఒక్కరేనేమో,

గాడిచర్ల హరిసర్వోత్తమరావు, శనివారపు సుబ్బారావుగార్లతో కలిసి, ఆచార్య రంగా వయోజన విద్యా వ్యాప్తి కోసం యెంతో కృషి చేశారు. అందు నిమిత్తమై "అఖిల భారత వయోజన విద్యా సమితి" పేరుతో ఒక సంఘాన్ని 1939 లో ఢిల్లీలో స్థాపించారు. "వయోజనవిద్య'' పై ఆయన ఆంగ్ల భాషలో రచించిన గ్రంథం ప్రపంచ ప్రఖ్యాతి గాంచినది. గ్రామీణ ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేసేందుకయి ఆయన 1946 లో ''అఖిల భారత గ్రామీణ ప్రజల సమాఖ్య''ను స్థాపించారు.

ఆయన అంతర్జాతీయ వాది కూడ. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దాస్య శృంఖలాలలో మ్రగ్గిపోతున్న ఆఫ్రికన్ ప్రజల దాస్య విముక్తి కోసం పోరాడేందుకయి, 1942 లో లండన్‌లో "వలస జాతుల విమోచన సమితి" పేరుతో ఒక సంఘాన్ని స్థాపించారు. ఆ సంస్థ ఆఫ్రికన్ ప్రజల స్వాతంత్ర్యం కోసం యెంతగానో కృషి చేసింది. యీ రంగంలో ఆయన కృషిని 'పాన్-ఆఫ్రికన్ కాంగ్రెస్' నాయకుడూ, ప్రముఖ నవలా రచయితా అయిన పీటర్ అబ్రహామ్ యెంతగానో ప్రశంసించారు. మన జాతీయ నాయకులలో "జవహర్‌లాల్ నెహ్రూను" మినహాయిస్తే, విదేశాల స్వాతంత్ర్య పోరాటంతో సంబంధం కలిగివున్న వ్యక్తి, ఆచార్య రంగా ఒక్కరే.

మన దేశంతో ఆయన యెన్నో ఉద్యమాలకు సృష్టికర్త కాగా, ఆయనకు సంబంధం లేని ఉద్యమమంటూలేదు ... ఆయన జీవితమే ఒక మహోద్యమం.... జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆయన యెన్నో సంఘాలను స్థాపించారు. ఆయన స్థాపించినన్ని సంఘాలు, భారత దేశంలో మరే నాయకుడూ స్థాపించలేదు.

ఈనాడు ఆచార్య రంగాగారి 86 వ జన్మ దినోత్సవం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు సంఘాధ్యక్షుడు శ్రీ జలగం వెంగళరావుగారు జరుపుతున్నందుకు వారికి అభినందనలు తెలుపుతూ ముగిస్తా !

# నా మాట – ముగింపు మాట

ఆచార్య రంగాగారి కంటే ముందు ఎందరో మహనీయులు రైతాంగానికి సేవ చేశారు. గ్రామీణ ప్రజల సంక్షేమానికి పాటుపడ్డారు. జమీందారి వ్యతిరేక పోరాటాల్ని నడిపించారు. రంగాగారి ప్రత్యేకత ఏమిటి?

రంగా గారితో పాటో–లేక ముందుగానో జమీందారీ వ్యతిరేక పోరాటాల్ని, రైతు ఉద్యమాల్ని నడిపి ప్రజానాయకుడయ్యాడు, స్వామి సహజానంద సరస్వతి. అట్లే ఇందులాల్ యాగ్నిక్. మరెందరో! ఆ మాటకొస్తే గాంధీజీ నీలిమందు తోటల రైతు సమస్యలపై నడిపిన సత్యాగ్రహం అప్పటిదే! కనుక రంగాగారి ప్రత్యేకత ఏమిటి ?

సిద్ధాంత రీత్యా
శాస్త్రీయ పద్ధతిలో

యిచట రంగాగారి రైతు సేవలను అర్థం చేసుకోవలసి ఉంది. స్వరాజ్యం సిద్ధించితే రైతులు బాగుపడతారు. జీవన భృతి పెరుగుతుంది. ఆర్థిక వనరులు ఏర్పడుతాయి. అందరూ యిచ్చే నినాదాలే యివి. ధనికవాద వ్యవస్థలను బలపరచే సిద్ధాంతాలపై నమ్మికగల వారి నోళ్ళ నుండి వచ్చే నినాదాలే యివి. కాగా రంగా గారి ప్రత్యేకత ఏమిటి ?

భూమికి రైతు కామందు. భూమి రైతు ఆస్తి. అది వారి పెట్టుబడి. పరిశ్రమవేత్త వెచ్చించే పెట్టుబడి యిదీ ఒకటే. భూమి విలువ ఎంత ఉంటే అంత పెట్టుబడి క్రింద జమకట్టాలి. ఈ ఆస్తిని అన్యాక్రాంతం చేయటానికి ఎవరికి

హక్కు ఉండరాదు. ప్రభుత్వానికి అసలు లేదు. ఉండకూడదు. సమష్టి వ్యవసాయం లేక సీలింగు పేరుతో వారి ఆస్తిని గుంజుకోరాదు. పెట్టుబడులు లేని కార్మిక వర్గంతో వీరిని సమానం చేయరాదు. ఆ మాట కొస్తే పట్టణాలలో ఉండే ఆస్తి అంతస్థులను కూలదొయ్యకుండా-పల్లెల్లో ఉన్న రైతుల సంపదను ఎందుకు అన్యాక్రాంతం చేయాలి. చేయరాదు. యిది ఫ్యూడలిజం కాదు. జమీందారీ, జాగీరు దారి విధానాల రద్దుతోనే అంతమైంది, ఫ్యూడలిజం అన్నారు. అంటారు. యదార్థం పలికారు. రంగాజీ లేకుంటే భారతదేశం పల్లెసీమలకు చెందినది, రైతే రాజు కావాలనే గాంధీజీ సిద్ధాంతం గూడా అర్థరహితమే!

మారుతున్న రాజకీయ పరిస్థితులకనుగుణ్యంగా-తన సిద్ధాంతాన్ని బలపరచు కొంటూ-అనేక వ్యాఖ్యలు, వాదనలు చేసుకొంటూ-రంగాజీ నిరంతర పోరాటం సాగించారు. ఆయన పోరాటాలు, అనుభవాలు సిద్ధాంతపరమైనవి. స్థిరమైనవి. కాంగ్రెసు హైకమాండును ధిక్కరించారు. బాపూజీతో విభేదించారు. నెహ్రూ ప్రభుత్వాన్ని ఎదిరించారు. చివరకు బాపూజీచేత రైతుకూలి ప్రజారాజ్యానికి ఆశీస్సులు సంపాదించాక శాంతించారు.

భావి భాష్యకారులకు యిది ఒక
యితివృత్తంగా మిగులుతుంది.

నేడు వారి 86 వ జయంతి ఉత్సవాలు భారీయెత్తున చేయటం, ప్రత్యేక సంచికను వెలువరించటం ముదావహం. అంతకంటే ఏం కావాలి!

మరొక మాట. ఈ సంచికను ఆవిష్కరించనున్న కామ్రేడ్, రాంకిషను గారు గూడా మరొక మహావ్యక్తి. జాతీయ నాయకులు. బహుముఖ ప్రజ్ఞాశాలి. ఎంతో చరిత్రను జీర్ణించుకొన్న ఘనుడు. స్వాతంత్ర్య పోరాటంలో విప్లవవీరులు. సర్దారు భగత్‌సింగు వర్గంలోనివారు. కాలేజీ చదువులనుండి చేయిచేయి కలిపి పనిచేశారు. ఆయన సతీమణి, ఆయన అనేక యిడుమలకు గురయ్యారు. జైళ్ళు వాళ్ళ క్రీడాస్థలాలు. కాకలు తీరిన దేశభక్తులు.

ఆనాడు వీరు స్థాపించిన నవజీవన్ భారత సమాజ్ సభ్యులంతా కామ్రేడ్ అని పిలుచుకొనేవారు. యిప్పటికి మన రాంకిషన్‌కు ఆ కామ్రేడ్ పదం అతిప్రియమైంది. వీరు నిరాడంబర జీవులు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలే వీరి బంధువర్గం. అఖిలభారత స్వాతంత్ర్య సమరయోధుల సంస్థ ప్రిసీడియం సభ్యులలో ఒకరు. అంటే వీరు గూడా మాసంస్థకు రంగాజీ పృథ్వసింగు గారితో పాటు అధ్యక్షస్థానంలోని వారు.

అవిభాజ్య పంజాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. పార్లమెంటు సభ్యులుగా ఉన్నారు. ఆంధ్ర నాయకులకు-తెలుగు దేశానికి చిరపరిచితులు. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షులు శ్రీ జలగం వెంగళరావుగారు వీరిరువుర్ని యీనాడు సత్కరించి అభినందనలు అందించటం ఎంతో గర్వకారణం అనే చెప్పాలి ఆ రీత్యా వారుగూడా అభినందనీయులే! అఖిలభారత కాంగ్రెసు శత జయంతి సందర్భంగా జరుపుకొంటున్న యీ వేడుకలు తెలుగు ప్రజలకు మరుపురాని స్మృతులు కాగలవు గూడా!

మా సంచిక కమిటీ తరపున, ఆంధ్ర ప్రదేశ్‌లోని స్వాతంత్ర్య సమర యోధుల తరపున, ప్రజల తరపున, నాతరపున వీరికి హృదయపూర్వక కుసుమాంజలులు అర్పించుతూ ముగించుతా!

వి. యల్. సుందరరావు
కన్వీనరు, సంచిక కమిటీ
ప్రధాన కార్యదర్శి,
అఖిలభారత స్వాతంత్ర్య సమరయోధుల సంస్థ.

గాంధీభవన్
హైదరాబాదు-1
తేది 1-11-1985

## IN THE NEWS

# Crusader for literacy

"MY work started in 1917 in villages under the inspiration of Annie Besant and her Scout movement. It was Veeresalingam, the great social revolutionary, who started our village schools in Guntur district. Then we went to Krishna and Nellore districts". This is how Prof. N. G. Ranga, recipient of the Literacy Award this year, reminisces about the early years of his crusade against adult illiteracy.



In Madras, Prof. Ranga who was then a teacher in the Pachaiyappa's College, worked in slums near the Harbour and Royapuram. His band of student volunteers include C. N. Annadurai, then a dynamic young man who gave full support to the Professor. "We ran night schools for the homeless people in the city and Annadurai was such a good colleague", says the Professor.

What were his memorable experiences? "We used to collect grain in the villages and then prepare food; we sold the remaining rice and with the money realised, we financed the education of poor children". He had the opportunity of continuing with this work both in and outside the Congress Party.

wife, Bharati Devi. Some of the Union Ministers, present and past, were students of the village schools, he points out. Even the political schools started before Independence to propagate political beliefs did much in spreading the message of literacy. Everywhere politics came in, because people were then fighting for freedom. "No other activity had any meaning in those days".

Meeting this octogenarian, one is struck by his passion for the adult literacy movement. He mentions several places in Tamil Nadu where they ran these schools: This applies to other States in the country. Very little publicity was, however, available to them in those days. All the recognition the workers needed was a "nod of appreciation from Mahatma Gandhi". Ungrudgingly, Prof. Ranga gives his praise to people like Senivarapu Subba Rao, Puturi Nagabhushana and Avinashilingam Chettiar who did excellent work in the field.

Advocating a revolving fund for adult education, the veteran leader says that this work must receive as much priority as drought and flood relief. Why was the National Adult Education Programme (NAEP) given a short shrift within three years of its launching? Prof. Ranga says that Mr. Morarji Desai, the then Prime Minister, meant well in encouraging the NAEP but some of his political colleagues exploited this to their advantage.

The present Union Government supports the

ago, a forum of MPs was started for promoting adult education, the objective being to press the Government of India for more attention to this work. In his view, some States and universities are doing very good work; the Rayalaseema Seva Samithi which has already won an all-India award from the President has also been engaged in rural literacy and social uplift activities.

The 87-year-old Prof. Ranga (Nidubrolu Gogineni Ranganayakulu) has had a chequered career in the academic and political arena. After graduation from Oxford University in Economics, he returned to Madras in 1928 and became an adviser to the Madras Government on financial matters. Resigning from this post in 1930, he became a member of the Central Legilsative Assembly. He championed the cause of the kisans through the Vauhini magazine in Telugu which he started in 1936. In 1944, he was again elected to the Central Legislative Assembly.

In 1952, just before the formation of Andhra Pradesh State, there was a crucial election to the presidentship of the A.P. Congress Committee in which Mr. N. Sanjiva Reddy got elected. At that time, Prof. Ranga and T. Prakasam left the Congress. Prof. Ranga established the Krishikar Lok Party and Mr. Prakasam, the Praja Party. In 1952, Prof. Ranga was elected to the Rajya Sabha and later, he became the President of the Swatantra Party founded by Rajaji.

He was elected to the Lok Sabha in 1957 and also in 1967. In 1980, he came back to the Congress (I) and was elected to the Lok Sabha from the Guntur parliamentary constituency. He was reelected in 1984 to the Lok Sabha and is now Deputy Leader of the Congress(I) Parliamentary Party.

Rajaji had described Prof. Ranga as "one of our exceptional men, men whose whole concern is the happiness of our people and not one's own advantage." The infectious laughter